# వాణి


తెలుగు అసోసియేషన్ సిడ్నీ

సంపుటి 56 సంచిక 135 ఫిబ్రవరి 2021


*పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి*



**సిడ్నీ ఒపెరా అందాలు**

## విషయ సూచిక


**సంపాదకీయం – విజయ మాధవి గొల్లపూడి**.......................................................................................1

సెక్రెటరీ రిపోర్ట్ – **అపర్ణ సుసర్ల..... ........................................................................................2**


## శీర్షికలు


శ్రీమద్భగవద్గీత – రంగారావు పెయ్యేటి ........................................................................................4

**రథ సప్తమి** - లలిత రాంభట్ల ........................................................................................10

గీయని చిత్రం రాయని గేయం-రాజా తల్లప్రగడ........................................................................................11

ది బ్లేడ్స్-మూర్తి జొన్నలగెడ్డ ........................................................................................12

సమస్యా పూరణం-శివప్రసాద్ చావలి ......................,..................................................................13

కృష్ణం వందే జగద్గురుం-లక్ష్మి మదన్........................................................................................14

వినోద్ బాబా- శ్రీదేవి పెయ్యేటి...................... ..........................................................................15

ఓ ఇల్లాలి పెళ్ళి పుస్తకం - రంగారావు పెయ్యేటి........................................................................................18

అమెరి"కరోనా కవిసమ్మేళనం కథ - చిట్టెన్ రాజు వంగూరి........................................................................................23

గిన్నీస్ బుక్ విజేత –ప్రసాద్ రాంభట్ల........................................................................................26

కళా తపస్వి-విజయ గొల్లపూడి........................................................................................30

అందమాను అండమాను-సోమనాథశాస్త్రి గొర్తి........................................................................................32

సంగీతనాదామృతం-పద్మ మల్లెల ........................................................................................35

వంటిల్లే మన ఔషధాలయం-అనురాధ నేదునూరి........................................................................................40

చిత్రకళ- ప్రసూన రవీంద్రన్........................................................................................42

మహిమ – డి. కామేశ్వరి........................................................................................44

ఘనమైన నీతి భవనాలు-ఉషా శ్రీదేవి శ్రీధర........................................................................................53

**Telugu Association Inc.**
PO Box -1382, Parramatta, NSW 2124
ABN : 56 303 933 034
www.sydneytelugu.org
పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయ్!

email: vahini@sydneytelugu.org

| ఎడిటర్ | అసోసియేట్ ఎడిటర్ | కో-ఆర్డినేటర్ |
|---|---|---|
| విజయ మాధవి గొల్లపూడి | సాయి లక్ష్మీనారాయణ గొల్లపూడి | ప్రసాద్ రాంబొట్ల |

# సంపాదకీయం

మాఘమాసం ఫిబ్రవరి నెల తెలుగువాహిని క్రమం తప్పకుండా చదివే తెలుగు తేజాలు అందరికీ శుభాభివందనాలు. సప్తసముద్రాలు దాటి వచ్చినా సనాతనధర్మం, సంప్రదాయాలను వీడకుండా ఆచరిస్తున్న వారు కొందరు అందరిలో ఉండటం వల్ల వస్తున్న అనర్థాలను తిప్పికొట్టగలుగుతున్నాము అని భావన కలుగుతుంది. రంగులీనే సీతాకోకచిలుక కంటిముందు కదలాడటానికి ముందు కొద్దికాలం పాటు బయటికి రాకుండా తన చుట్టూ ఏర్పరుచుకున్న కవచంలో దాక్కుని ఉంటుంది. అదే రీతిన కరోనా పాజిటివ్ మాట  వినగానే ఆస్ట్రేలియా ప్రభుత్వ యంత్రాంగం కఠిన నియమ నిబంధనలతో జీరో కేసులు నమోదు చేయగలిగేలా లాక్డౌన్, గుంపులు గుమిగూడకుండా నివారిస్తూ అవిశ్రాంతంగా పని చేసినతీరు వల్ల ఇకపై బయటకు ధైర్యంగా వెళ్ళగలమనే భరోసా కలుగుతోంది. మళ్ళీ యధేచ్ఛగా సరిహద్దు దాటి భారతదేశం వెళ్ళగలిగే మంచిరోజుకోసం ఎదురుచూద్దాము.
కళ అనేది దైవదత్తం. రచయితలకు, కవులకు, కళాకారులకు తగిన గుర్తింపు చాలా అవసరం. సూర్యుని వెలుతురు ఎదిగే మొక్కకు ఎంత అవసరమో, అలాగే ఆత్మీయమైన పలుకులు, ప్రశంస, స్పందన అనేవి కూడా కళ రాణించడానికి ఆక్సిజన్ లాగా అత్యవసరం. ఈ దిశగా వాహిని వెలువడగానే అందుకునే ప్రశంస ఆనందాన్ని ఇస్తుంది. నేను వాహిని బాధ్యతలు చేపట్టి ఈ నెలతో మూడు సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో నాకు ప్రోత్సాహం, సహాయ సహకారాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా అందచేస్తున్న ప్రతి ఒక్కరికీ వందనాలు.
ఈ నెల వాహిని లో ప్రత్యేకంగా సాహిత్యం పై అభిలాష ఉన్న వారికై సమస్యాపూరణం, పుట్టిన రోజు సందర్భంగా వారి సేవలు గుర్తుంచుకుంటూ మహానుభావులగురించి వ్యాసాలు, ఇంకా మరెన్నో పొందుపరిచాము.
ఫిబ్రవరి నెల లో రెండు రోజుల వెలితి ఉన్నా గాని, అన్ని పేజీలు తెలుగు వాహిని లో ఒకసారి తిరగవేసి తెలుగు భాషతో సాన్నిహిత్యాన్ని పెంచుకుంటారని ఆశిస్తూ…

**మీ శ్రేయోభిలాషి**

**విజయ గొల్లపూడి**

**0438293687**

**vahini@sydneytelugu.org**

## ఎక్జిక్యుటివ్ కమిటీ


ప్రెసిడెంట్: మధు బైరెడ్డి
0425 209 397


వైస్ ప్రెసిడెంట్: మోహన్ కుమార్ పరసు
0419 219 526


సెక్రెటరీ: : అపర్ణ సుసర్ల
0424 558 371


ట్రెసరర్: హరిబాబు కొల్లూరి
0425 291 032


కమిటీ మెంబర్: వీర్రాజు గున్నం
0431 714 501


కమిటీ మెంబర్: కామేశ్వరి ఉడత
0424 937 166


కమిటీ మెంబర్: ప్రసూన కంభంమెట్టు
0405 445 662

## సబ్ కమిటీలు


తెలుగు వాణి కన్వీనర్ :
రాజా తల్లాప్రగడ
0422 953 668


తెలుగు వాహిని ఎడిటర్:
విజయ గొల్లపూడి 0438 293 687


తెలుగు బడి కోఆర్డినేటర్
రావు పెద్దాడ 0456 226 000


వనితా మండలి కోఆర్డినేటర్
శోభ వెన్నలకంటి - 8901 3636


వెబ్ అడ్మిన్ : అపర్ణ సుసర్ల
0424 558 371


సిడ్నీ తెలుగు సీనియర్స్ కోఆర్డినేటర్
రవి సీతంరాజు

## ఆఫీసర్స్


మూర్తి పోతుకూచి-రిటర్నింగ్ ఆఫీసర్


ఆడిటర్
మధు వెన్నెలకంటి


పబ్లిక్ ఆఫీసర్
రవి సీతంరాజు

# SECRETARY REPORT

Dear Members,

The holidays are over, and I do hope everyone had an enjoyable break. Not being able to do any overseas travel in holidays is disappointing but I am sure it gives us an opportunity to explore the local spots in and around New South Wales.
A big shout out to all our volunteers – Telugu Badi Teachers, Telugu Badi Sub-Committee members, Telugu Vani Broadcasters, Telugu Vani Sub-Committee members, Telugu Vahini contributors, Telugu Vahini Sub-Committee members, Telugu Vanitha Co-Ordinators, Telugu Vanitha Sub Committee members, STA website contributors, Web Developers, and administrators. Thank You to Telugu Seniors Sub-Committee members, Public Officer, Auditor, Returning Officer, UAI representatives, FTAA representatives and PFC members for their continued support.

All the volunteers have adapted to the technology and new way of working and ensured that all the weekly activities are delivered as per schedule. The volunteers are showing enormous resilience, commitment, and dedication in serving the community.

The EC has been working closely with sub-committees and the summary of activities are shared below:

- Telugu Badi has commenced Term1 on 31 Jan 2021 with face-to-face classes in Kellyville (Beaumont Primary School), Quakers Hill (Hambleton Primary School), Eastwood (Eastwood Primary School) and Strathfield South Primary School. Online classes are also available. The Sub-Committee along with experienced teachers have developed study material and curriculum and the books are used in all Telugu Badi locations.

- New Telugu Vani Committee has taken charge and have commissioned a new Facebook page - https://www.facebook.com/STAteluguvani

- The Executive Committee has formed a Five-Member Public Fund Committee (PFC) to work on deductible gift recipient (DGR) status. The appointment of PFC members is in accordance with the conditions stipulated in our recently approved constitution. The appointment is for a period of up to 3 years. The PFC members are Dr. Kanaka Sundaram Rachakonda, Mr. Sateesh Babu Varada Raju, Mr. Gopal Krishna Gatiganti along with Treasurer and The President.

- Sri Prasad Rambhotla has been appointed as Vahini Co-ordinator to work with Smt. Vijaya Gollapudi in the Vahini Sub-Committee.

The EC is undertaking a major initiative to drive youth participation and involvement within the association. As a first step, we are gathering and collecting information about your children, their interests, and skillsets. This information is useful to tailor STA events and communications to our children and their interests. Soon you will be receiving an email to register your children details.

Planning is underway for our 2021 flagship Ugadi event and the program details will be shared soon. If restrictions continue to ease, we will be having a face-to-face event with lot of local talent. Please encourage your children especially Youth ages 18 years and above to participate in the Ugadi event and Sub-Committee activities.
We are grateful to all our sponsors for the continued support during this pandemic year and looking forward to the same support in future.

Best Regards,
Aparna Susarla, Secretary Sydney Telugu Association.

**Vahini**

**వాహినికి మీ రచనలు పంపడానికి, సూచనలు, స్పందనలు తెలుపడానికి మీరు పంపవలసిన మా చిరునామా - vahini@sydneytelugu.org**

Newsletter of Telugu Association Inc., Sydney published in

*Telugu*,

The second largest language spoken in India

Please visit sydneytelugu.org and subscribe to Vahini monthly magazine to receive by e-mail.

❖❖❖❖❖

**విజ్ఞప్తి**

మీ శీర్షికలు, వాణిజ్య ప్రకటనలు వాహిని పత్రికలో ప్రచురించడానికి, విజయ మాధవి గొల్లపూడి vahini@sydneytelugu.org ద్వారా సంప్రదించగలరు. మీ ప్రచురణలు ప్రతి నెల 25వ తారీఖు లోపల పంపవలసినదిగా విజ్ఞప్తి. మీ రచనలతో పాటు ధ్రువీకరణ పత్రము, వాహినిలో ప్రచురించుటకు అంగీకార పత్రము జతపరచగలరు.

Disclaimer: It may be that this magazine uses some freely available content and material from web purely for informative purposes.

❖❖❖❖❖

భాష్యం: శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్



**అథ ద్వితీయోధ్యాయః - సాంఖ్యయోగః**

(రెండవ అధ్యాయము - సాంఖ్యయోగము)

21.
వేదవినాశినం నిత్యం య ఏవమజమవ్యయమ్ |

కథం స పురుషః పార్థ కం ఘాతయతి హంతి కమ్ || 21 ||

హే పార్థ! = ఓ అర్జునా!

యః = ఏ పురుషుడు

అవినాశినం = నాశరహితమైనట్టిదియు

నిత్యం = పరిణామము లేనట్టియు

అజం = పుట్టుక లేనట్టిదియు

అవ్యయ = అపక్షయము (కృశించుట) లేనట్టిదియు అగు

ఏవం = ఈ ఆత్మస్వరూపమును

వేద = తెలిసికొనునో

సః = ఆ

పురుషః = పురుషుడు

కథం = ఎట్లు

కం = ఎవనిని

ఘాతయతి = సంహరించుటకు

ప్రేరణము చేయును?

కం = ఎవనిని

హంతి = వధించును?

ఓ అర్జునా!  ఈ యాత్మ నెవడు జననమరణములు లేనివానిగను, నాశరహితునిగను, నిత్యునిగను ఎఱుంగునో, అట్టివాడెట్లు ఒకనిని చంపించగలడు, చంపగలడు?

భగవద్గీతలో పరమాత్మ గీతలో మాటిమాటికీ 'అహంకారవిమూఢాత్మా కర్తాహమితి మన్యతే' - అవిద్వాంసుడు నేను కర్తనని తలచుననియు, తత్త్వవేత్త 'నేను కర్తను కానని తలచుననియు, ఎవడు విరక్తుడో అట్టివాడు 'సర్వకర్మాణి మనసా సంన్యస్యాస్తే సుఖం వశీ' సర్వకర్మలను మనస్సుచే త్యజించి సుఖముగ నుండునని చెప్పినాడు.

(చంపేదెవరు, సమసేదెవరు, సర్వము నీవే కదా?)

22.

వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి |

తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ  || 22 ||

యథా = ఏ విధముగా

నరః = మానవుడు

జీర్ణాని = జీర్ణమైనట్టి (పాత)

వాసాంసి = వస్త్రములను

విహాయ = విడచి

అపరాణి = ఇతరములైన

నవాని = నూతనమైన వానిని (కొత్త వస్త్రములను)

గృహ్ణాతి = గ్రహించునో

తథా = అట్లే

దేహీ = దేహమును ధరించిన జీవాత్మ

జీర్ణాని = పాత

శరీరాణి = శరీరములను

విహాయ = విడచి

అన్యాని = ఇతరములైన

నవాని నూతనమైన వానిని (శరీరములను)

సంయాతి = పొందును.

మానవుడు ఏ విధముగా నైతే చిరిగిపోయిన పాత వస్త్రాలను విడచిపెట్టి కొత్త వస్త్రాలను ధరిస్తాడో, అదే విధంగా ఆత్మ పాత శరీరాలను వదలి కొత్త శరీరాలను ధరిస్తూవుంటుంది.

శరీరాణి అని బహువచన ప్రయోగం జరిగింది.  (శరీరములను).  జ్ఞానాగ్ని వలన కర్మసంచయం దగ్ధం కాకపోతే జీవునికి అనేక జన్మలు ఎత్తవలసి వుంటుంది.  చిరిగిపోయిన వస్త్రాలను వదిలిపెట్టి అన్నారు.  అంటే వార్ధక్యం వలన శిథిలమైన శరీరాలను అని కాదు.   అందరూ వార్ధక్యం వచ్చిన తరువాతనే మరణించటల్లేదు కదా?  బాల్యంలోను, యౌవనదశలోను కూడా తనువు చాలిస్తున్నారే?  అంటే ప్రారబ్ధం శిథిలమైన తరువాత అని అర్థం.

అర్జునుడు భీష్మాది పూజనీయులు, పుణ్యమూర్తులతో నేనెలా యుద్ధం చెయ్యగలను అని అడిగాడు.  ఆ సందేహాన్ని తీర్చడం కోసమే పరమాత్మ ఈ విధంగా చెప్పడం జరిగింది.  'జీర్ణాని విహాయ వస్త్రాణి నవాని గృహ్ణాని విక్రియాశూన్య ఏవ నరో

యథా' (ఎట్లు విక్రియాశూన్యుడయి యే నరుడు జీర్ణములగు వస్త్రములను త్యజించి నూతనములగు వస్త్రములను గ్రహించునో) అనుట చేతనే తావన్మాత్రగ్రంథము చేతనే సరిపడుచున్నను 'అపరాణి' అను విశేషణము నుత్కర్షాతిశయద్యోతకముగ నివేశించెను. అందుచే నెట్లు ప్రాకృతజనుడు నికృష్టములగు వస్త్రములను విడిచి యుత్కృష్టములగు వస్త్రములను స్వీకరించునో అను అర్థమెటులౌచిత్యము వలన ప్రాప్తించునో యట్లే 'జీర్ణాని' (వయస్సు చేతను, తపస్సు చేతను కృశించిన) దేహములను విడిచి 'అన్యాని శరీరాణి' (సర్వోత్కృష్టములగు దేవాది శరీరములను) 'దేహి' (ప్రకృష్టధర్మానుష్ఠాత యగు భీష్మాది దేహవంతులు) 'సంయాతి' (చిరోపార్జిత ధర్మఫల భోగము కొఱకు గర్భవాసాది క్లేశమును విడిచియే పొందెదరు) అనునర్థమౌచిత్యము వలన ప్రాప్తించును. ఈ విషయమునే 'అన్యన్నవతరం కల్యాణతరం రూపం కురుతే పిత్ర్యం నా గాంధర్వం దైవం వా ప్రాజాపత్యం వా బ్రాహ్మణం వా' అను శ్రుతి గూడ జెప్పుచున్నది.

భీష్మాదులు యావజ్జీవము ధర్మానుష్ఠాన క్లేశము చేతనే జర్ఝరితశరీరులై యీ వర్తమాన దేహముల విడిచి గాని యా ధర్మఫలము ననుభవింపజాలకుండిరి. కావున నీవీ ధర్మయుద్ధముచే స్వర్గప్రతిబంధకములగు వారి శరీరములను నశింపజేసి దివ్యదేహసంపాదనమున వారిని స్వర్గయోగ్యులనుగా జేసి వారికీ విధమున నుపకారమును జేయదగుదువు. ఇట్లే దుర్యోధనాదులకు కూడ స్వర్గభోగ్య దేహసంపాదనచే గొప్ప యుపకారము జేసినవాడ వగుదువు. కాన నత్యంతోపకారకమగు నీ యుద్ధమునందు అపకారకత్వ భ్రమను జేయవలదని 'అపరాణి, అన్యాని, సంయాతి' అను పదత్రయ స్వారస్యముచే భగవదభిప్రాయమూహించ బడెను.

'ఓ అర్జునా! నీవు సాగించబోయే ఈ పోరు వలన, నీ ద్వారా భీష్మాది పుణ్యమూర్తులు తమ శిథిలమైన దేహాలను త్యజించి, జ్ఞానాగ్ని చేత తమ కర్మసంచితాలను దగ్ధం చేసుకుని, మానవజన్మను చాలించి, ఉత్తమమైన దేవాది శరీరాలను ధరించబోతున్నారు. అలాగే దుర్యోధనాదులు కూడా ఈ ధర్మయుద్ధంలో మరణించడం ద్వారా ఆర్జించుకున్న పుణ్యం వలన స్వర్గభోగాలను అనుభవించ బోతున్నారు. నీద్వారా వారందరికీ మేలు జరగబోతోంది సుమా!' అని పరమాత్మ బోధిస్తున్నాడు.

23.

నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః |

న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః || 23 ||

ఏనమ్ = దీనిని (ఈ ఆత్మను)

శస్త్రాణి = శస్త్రములు

న, ఛిందంతి = ఛేదింపజాలవు.

ఏవమ్ = దీనిని

పావకః = అగ్ని

న, దహతి = దహింపజాలదు.

ఏనమ్ = దీనిని

ఆపః = నీరు

న, క్లేదయంతి = తడుపజాలదు

చ = మరియు

మారుతః = గాలి

న, శోషయతి = ఆరిపోవునట్లు చేయజాలదు.

ఈ ఆత్మను శస్త్రములు ఛేదింపజాలవు. అగ్ని దహింపజాలదు. నీరు తడుపజాలదు. వాయువు ఆరిపోవునట్లు చేయజాలదు.

జీవునకు శరీరము, మనస్సు, ఆత్మ అను మూడు కలవు. వీనిలో ఒకదానికంటె మఱియొకటి అతిసూక్ష్మముగ నుండును. స్థూలపంచభూతములు (శస్త్ర జలాదులు)స్థూలమగు శరీరమునే బాధింపగలవు గాని సూక్ష్మమగు మనస్సును గాదు. అట్టిచో అతిసూక్ష్మమగు ఆత్మనెట్లు అవి బాధింపగలవు? అవయవములు గల వస్తువులనే శస్త్రములు ఛేదింపగలవు, అగ్ని దహింపగలదు, నీరు తడుపగలదు, వాయువు శోషింపగలదు. కాని అవయవములు లేని ఆత్మను ఏమియు జేయజాలవు.

జరారోగాదులు, భౌతిక దైవికోపద్రవములు శరీరసంబంధములే కాని ఆత్మకు సంబంధించినవి కావు.

24.

అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమ్ అక్లేద్యోఽశోష్య ఏవ చ |

నిత్యః సర్వగతః స్థాణుః అచలోఽయం సనాతనః || 24 ||

అయమ్ = ఇది (ఈ ఆత్మ)

అచ్ఛేద్యః = ఛేదించుటకు శక్యము కానిది.

అయమ్ = ఇది

అదాహ్యః = దహించుటకు వీలు కానిది

అక్లేద్యః = తడుపుటకు వీలు కానిది

చ = మఱియు

ఏవ = నిస్సందేహముగా

అశోష్యః = శోషింపజేయుటకు సాధ్యపడనిది

అయమ్ = ఇది

నిత్యః = నిత్యమైనది

సర్వగతః = అంతటా వ్యాపించియున్నది

అచలః = చలింపనిది

స్థాణుః = స్థిరముగా ఉండునది

సనాతనః = సనాతనమైనది.

ఈ ఆత్మ ఛేదించుటకును, దహించుటకును, తడుపుటకును, శోషింపజేయుటకును సాధ్యము కానిది. ఇది నిత్యము, సర్వవ్యాపి, చలింపనిది, స్థాణువు, సనాతనము.

పంచభూతములు పాంచభౌతికమైన వస్తువునే బాధింపగలవు. ఆత్మ పంచభూతాత్మకము కాదు. కనుక ఆత్మపై వాని ప్రభావముండదు. 'నిత్యః - ఆత్మ కాలాతీతమైనది. సర్వగతః - దేశాతీతమైనది.

25.

అవ్యక్తోఽయ మచిన్త్యోఽయ మవికార్యోఽయ ముచ్యతే |

తస్మా దేవం విదిత్వైనం నాను శోచితు మర్హసి || 25 ||

అయమ్ = ఇది (ఈ ఆత్మ)

అవ్యక్తః = వ్యక్తము కానిది. (ఇంద్రియములకు గోచరింపదు)

అయమ్ = ఇది

అచిన్త్యః = మనస్సునకును అందనిది

అయమ్ = ఇది

అవికార్యః = వికారములు లేనిది

ఉచ్యతే = (అని) చెప్పబడుచున్నది.

తస్మాత్ = అందువలన (ఓ అర్జునా!)

ఏనమ్ = దీనిని (ఈ ఆత్మను)

ఏవమ్ = ఈ రీతిగా (ఇంతవఱకు తెలుపబడినట్లుగా)

విదిత్వా = తెలుసుకొని

అనుశోచితుమ్ = శోకించుటకు

న, అర్హసి = అర్హుడవు కావు. (శోకించుట తగదు)

ఈ ఆత్మ ఇంద్రియములకు గోచరింపదు. మనస్సునకు అందదు. వికారములు లేనిది. దీనిని గురించి నీవు ఈ విధముగా తెలిసికొనుము. కనుక ఓ అర్జునా! నీవు దీనికై శోకించుట తగదు.

ఓం నమో భగవతే వాసుదేవాయ!

❖❖❖❖❖






❖❖❖❖❖

శ్రీ మహా గణాధిపతయే నమః　　శ్రీ రామాయ నమః　　శ్రీ గురుభ్యో నమః



# ఋషిపీఠం

ఆధ్వర్యంలో



## శ్రీ వేద గాయత్రి పరిషత్, సిడ్నీ నిర్వహించు

# జయ మంత్ర జప యజ్ఞం

### ఆహ్వాన పత్రిక

హిందువుల ధర్మ పరిరక్షణ కోసం చేస్తున్న ఈ సామూహిక రామ నామ జప యజ్ఞానికి ఇదే మా ఆహ్వానం . దీనిలో ప్రపంచం లో ఉన్న అందరూ హిందువులు పాల్గొన వలసినదిగా మా ప్రార్థన

పూజ్య గురువులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారి ఆశ్శీస్సులతో మన ధర్మం కోసం మన సాటి హిందువుల కోసం, మనం అందరం కలసి ప్రతిరోజు కనీసం 108 సార్లు

**"శ్రీరామ జయ రామ జయ జయ రామ"**

అనే రామ నామ మంత్రాన్ని జపం చేసి ఆ జప ఫలితాన్ని ప్లవ నామ సంవత్సర చైత్ర శుక్ల నవమి శ్రీ రామనవమి రోజున ( April 21 2021) సనాతన ధర్మ రక్షణకై శ్రీ రామచంద్రులవారికి ధారపోద్దాము .

| | |
|---|---|
| **Web** | : www.dharmayagna.org |
| **Registration** | : www.dharmayagna.org/register |
| **Further enquires** | : japam@srivedagayathriparishath.com |
| **Telegram Group** | : t.me/dharmayagna |

# రథసప్తమి

-శ్రీమతి. లలిత రాంభట్ల, హైద్రాబాద్



జగత్తుకు పాలకుడు సూర్యుడు, అతడు స్వచ్ఛమైన శ్వేతవర్ణంలో ఉంటాడు, సౌర కుటుంబంలో సూర్యుడే పెద్దన్న! అతని సోదరులు వాయువు, అగ్ని వీళ్లంతా అదితి పుత్రులే! వీరిది ఒకే కుటుంబం అదే సౌర కుటుంబం. అగ్ని వాయువుల మధ్య ఏడు కిరణాలతో సూర్యుడు లోకానికి దర్శనం ఇస్తున్నాడు.

సూర్యుడిది ఏకచక్ర రథం. దానికి ఏడు గుఱ్ఱాలు పూన్చి ఉన్నాయి. ఒకే గుఱ్ఱం ఏడు పేర్లతో లాగుతుంది. చక్రానికి మూడు నాభులు ఉన్నాయి, సర్వలోకాలు వాటినే ఆశ్రయించి ఉన్నాయి. ఏడుగురు అక్కచెల్లెళ్ళు ఈ రథం ముందు నడుస్తున్నారు, ఇందులో ఏడు గోవులు లేక కిరణాలు లేక స్వరాలు ఉన్నాయి.వేగవంతుడు అందగాడైన ఆదిత్యుడి  స్వరూపం అతి నిగూఢం. అతని కిరణాలు తెల్లని కాంతిధారల్ని ప్రసరిస్తాయి, అవి తేజ స్వరూపాలు అని ఋగ్వేదం చెబుతోంది.

తెల్లని సూర్యకాంతిలో దాగున్న ఏడు వర్ణాలు (VIBGYOR) వర్ణన కనిపిస్తుంది. మానవారు సూర్యుణ్ణి సూర్యనారాయణుడంటారు, శ్రీసూర్యనారాయణ! వేదపారాయణ! లోకరక్షామణి! దివ్య చూడామణి! అంటూ కీర్తిస్తారు. “శ్రీ సూర్యనారాయణ మేలుకో, హరి నారాయణ మేలుకో” అని మేలుకొలుపులు పాడుకుంటారు. “పొడుస్తూ భానుడు పొన్నపూవు చాయా” అంటూ ఒక అనుపల్లవి, ఏడు చరణలతో సాగె మేలుకొలుపు సూర్యుడి ఏడు గుర్రాలు, ఏడు వారాలకు, ఏడు వర్ణలకు, ఏడు ధాన్యాలకు ప్రతీక. సప్తమి తిధికి అంతటి ప్రాధాన్యత అందుకే! ప్రతి నెలలోను సప్తమిని సూర్యుడికి ప్రతీకగా భావించి సూర్యారాధన చేస్తారు. చిక్కుడు కాయలో ఏడు గింజలుంటాయని చిక్కుడిని సూర్యుడికి ప్రతీకగా భావిస్తారు.

చిక్కుడుకాయాల్ని రథాకారంలో అమర్చి మధ్యలో చిక్కుడు ఆకుని ఉంచి గంధంతో సూర్యనారాయణ మూర్తి ప్రతిమ చేసి పూజిస్తారు. ప్రత్యక్ష భగవానుడు అయిన సూర్యుడు తన కరుణను మనుషులందరితో పాటు తక్కిన సమస్త జీవరాశులన్నింటిమీద సమానంగానే ప్రసరిస్తున్నాడు. అందుకని ఆయన పుట్టినరోజైన రథసప్తమి రోజున జీవహింస చేయకుండా ఉండేందుకు మాంసాహారాన్ని ముట్టరు. శాకాహారాలు కూడా కూరగాయాల్ని కత్తితో తరిగి హింసించరు.

రథసప్తమి రోజున

“జననీ త్వం హి లోకానం సప్త సప్తికే,

సప్తవ్యాహృతికే దేవి! నమస్తే సూర్యమాతృకే,సప్తవ్యాహృతికే”

అనే మంత్రం చదువుతూ ఏడు జిల్లేడి ఆకులు, లేదా చిక్కుడు ఆకులు తల, భుజాలపై ఉంచుకుని స్నానం చేస్తారు. సప్తాశ్వములగల ఓ సప్తమి! నీవు సకల భూతాలకు, లోకాలకు జననివి. సూర్యునికి తల్లివైన నీకు నమస్కారం అని ఈ మంత్రం అర్థం. మాఘ శుద్ధ సప్తమి రోజున చేసేస్నానం ఏడు పాపాల్ని కడుగుతుంది. ఆ ఏడు పాపాలు ఏమంటే: ఈ జన్మలో చేసింది, జన్మాంతరంలో చేసింది, మనస్సు ద్వార చేసింది, మాటద్వారా చేసింది, తెలియక చేసింది, తెలిసి చేసింది. ఇలా ఏడు పాపాలు రథసప్తమి రోజున జిల్లేడు ఆకులను పెట్టుకుని చేసిన స్నానం కడిగేస్తుందని భావిస్తారు. జీవితాన్ని వెలుగుతో నింపే సూర్యభగవానుడికి మనం అందించే కృతజ్ఞత.

ఈ మాఘమాసం హరి హరులకిద్దరికి ప్రీతిపాత్రమైనదే ఈ మాసంలోనే మదన పంచమి, శ్రీపంచమి, వసంతోత్సవం, రథసప్తమి, భీష్మాష్టమి, భీష్మఏకాదశి, మాఘ పూర్ణిమ, మహా శివరాత్రి వస్తాయి. సాలగ్రామ హిరణ్యదానాలు, ప్రయాగలో వెండి దానం వంటివి కూడా ఈ మాసంలో చేయడం ప్రశస్తమంటారు.

ఫిబ్రవరి 19 వ తేది రథసప్తమి సందర్భంగా తెలుగువాహిని పాఠకులకు ఈ ప్రత్యేక వ్యాసం.

❖❖❖❖❖

## గీయని చిత్రం రాయని గేయం

-శ్రీమతి రాజా తల్లాప్రగడ, సిడ్నీ



గగనతలంలో అద్భుతాలు
మేఘాల వ్యూహాచిత్రాలు
రెప్పపాటులో మారేఆకారాలు
ఆశనిరాశల సంకేతాలు

ఆకాశంలో మబ్బుల్లా
మనసు ల్లో తలపులూ
వస్తూ పోతూ వుంటాయి
స్ఫూర్తినీ ఇస్తాయీ

నల్లనిమేఘం పలు రూపాలై
ఇలా శ్రీకృష్ణరూపం లో
బంగరు చంద్రకిరణకాంతితో
దర్శనమిస్తే ఊహకందేనా ఆనందం!!

❖❖❖❖❖

# <u>ది బ్లేడ్స్</u>

-డా. మూర్తి జొన్నలగెడ్డ, సౌత్ పోర్టు, UK

వ్యూహాత్మక విమాన విన్యాసాలు ప్రదర్శిస్తూ, ప్రయాణీకులను కూడా తమతో తీసుకు వెళ్ళ గల అనుమతి ఉన్న అతి తక్కువ దళాలలో 'ది బ్లేడ్స్' ఒకటి.

'రాయల్ విమాన దళం' మరియు 'రెడ్ యారోస్' దళంలో పూర్వానుభవం గల చోదకులతో ఏర్పడిన ఈ దళం ఐరోపా, మధ్య ప్రాచ్య దేశాలలో ఏడాదికి సుమారు నలభై ప్రదర్శనలు ఇస్తుంది.

సుమారు 700 కిలోల బరువు, 7 మీటర్ల పొడవు, 8 మీటర్ల రెక్కల నిడివి గల శక్తి వంతమైన 'ఎక్స్ట్రా 300 ఎల్. పి., 330 ఎస్. సి.' తరహా విమానాలతో 15 నిముషాల ప్రదర్శన జరుగుతుంది. అందులో 30 వివిధ విన్యాసాలు ప్రదర్శిస్తారు. ముఖ్యంగా విమానాలు నిట్ట నిలువుగా పైకెగసి, అక్కడ చోదన యంత్రాన్ని ఆపుచేసి, ఒక కాగితం ముక్క లాగ గిరికీలు కొడుతూ నేల వైపు పడిపోతూ ఆఖరి క్షణంలో మరల చోదన యంత్రాన్ని సంధించి, బాణాల వలె దూసుకు పోతుంటే కొన్ని వేల మంది ప్రేక్షకులు స్థాణువులై చూస్తుంటే మీ గుండె చప్పుడు మీకు వినిపిస్తూ ఉంటుంది.

తమ ఖజానా నుండి సుమారు ఒక లక్ష రూపాయలకు రెక్కలొచ్చి ఎగిరి పోవడానికి సిద్ధపడితే మీరూ ఈ అనుభవాన్ని పొందవచ్చు. ఇంగ్లాండులోని 'నార్తాంప్టన్' లోని వారి విమానాశ్రయానికి చేరుకోగానే 'బ్రిటిష్ ఎఇర్ వేస్' వారి అత్యుత్తమ 'వాయు యాన పర్యవేక్షకురాండ్లు' మిమ్ములను సాదరంగా ఆహ్వానించి, పరిచయ కార్యక్రమానంతరం మిమ్మల్ని ఒక బ్లేడ్స్ విమానంలో ప్రయాణిస్తూ విన్యాసాలలో పాల్గొననిస్తారు. తరువాత మీరు వీక్షణా స్థలంలో కూర్చొని పానీయాలు సేవిస్తూ వారి ప్రదర్శనను తిలకించ వచ్చు. బరువెక్కిన గుండెలతో మీరు వెనుతిరిగి వెడుతుంటే, జ్ఞాపికగా మీ విమాన విన్యాసాలను బంధించిన ఒక లఘు చిత్రాన్ని మీకిస్తారు. తదనంతరం మీరు దాన్ని తిలకిస్తున్నపుడు, రెక్కలొచ్చి ఎగిరి పోయిన మీ రూపాయలు అందులో కనిపిస్తాయన్న నమ్మకం నాకుంది.









❖❖❖❖❖

# సమస్యా పూరణము – నేను పూరించిన కొన్ని సమస్యలు

-శ్రీ శివప్రసాద్ చావలి, సిడ్నీ

### సమస్య: అన్నములేనివాడు పరమాన్నము పంచెను పల్లెపల్లెలన్

ఉ.

మిన్నగుణంబదన్చు కడు మెండుగ ప్రేమను పంచి చూపెనా
సన్నుత యోగి శ్రీ శిరిడి సాయి మహా మహితాత్ముడై యిలన్
ఎన్నగ ద్వారకామయి మసీదు నివాసియు కుక్షికిన్ తినన్
అన్నములేనివాడు పరమాన్నము పంచెను పల్లెపల్లెలన్

### సమస్య: రణమే ప్రాణము పోయు పద్యకళయై రాణించు సద్గోష్ఠులన్

మ.

గణనీయంబుగ పెంచు ధారణ చమత్కారంబు నేకాగ్రతన్
రణమే అయ్యవధానమున్ గెలువ ధారాళంబుగా వేదికన్
ఘనతన్ శ్రోతల మన్ననల్ గొన చమత్కారంబుతో పద్య పూ
రణమే ప్రాణము పోయు పద్యకళయై రాణించు సద్గోష్ఠులన్

### సమస్య: స్వరములు లేని గీతములు శ్రావ్యము లైనవి లోకులెన్నగన్

చ.

తరగని సంప్రదాయమది త్యాగయ చేసిన గాన కీర్తనల్
మరవము రామనామ జపమా కృతులందు పదే పదే వినన్
తరములు మారినన్ మధురతన్ కురిపించుచు పాడగన్ యప
స్వరములు లేని గీతములు శ్రావ్యము లైనవి లోకులెన్నగన్

### సమస్య: ధనమే చిత్తవికాస సంపదకు ప్రాధాన్యంబునై నిల్వగన్!

మ.వి

అనయమ్మున్ తెరపై లభించును సమాచారంబు గాలింప గ్ర
క్కున కక్కంగ మహిన్ మహా గురువు 'గూగుల్' యంత్రమున్! దూర ద
ర్శన 'యూట్యూబు' వినోదముల్ యొనరు విశ్వంబందు 'నెట్' వంటి సా
ధనమే చిత్తవికాస సంపదకు ప్రాధాన్యంబునై నిల్వగన్!

❖❖❖❖❖

# తేట గీతి పద్యాలు

## కృష్ణం వందే జగద్గురుం

-శ్రీమతి లక్ష్మి మదన్, హైద్రాబాద్

బ్రహ్మ కడిగిన పాదము భక్తి తోడ
పాద ధూళిని యంటగ పావనమ్ము
వెండి మువ్వల సవ్వడి వెతలు బాపు
పాలు వెన్నలు పెట్టెద బాల కృష్ణ
భువన మోహన రూపము భువిన వెలసి
కృష్ణ లీలలు చూపెను కృపను కలిగి
రాధ మానస చోరుడు మాధ వుండు
నీలి మేఘము బోలిన నీర జాక్ష
బోధ చేసెను గీతను యుద్ధ మందు
పార్థ సారథి భయమును ప్రార ద్రోలె
పాంచ జన్యము పూరించి ప్రార్థనగను
కృష్ణ తత్వము నేర్వగ తృష్ణ తోడ

❖❖❖❖❖



# వినోద్‌బాబా

-శ్రీమతి పెయ్యేటి శ్రీదేవి, హైద్రాబాద్

జై వినోద్‌బాబా!............జై జై వినోద్‌బాబా!..........

ఎన్నాళ్ళనించో అజ్ఞాతంలో వున్న వినోద్‌బాబా.... ఆరోజు, విజయదశమిరోజున ఆయన దివ్యదర్శనం కోసం లక్షలాది భక్తులు ఎదురు చూస్తున్నారు. ఆయనెంతో శక్తిసంపన్నులు. ఆర్థికసంపన్నులు కూడా. మామూలుగా ఆయన దర్శనం లభించదు. విజయదశమి రోజున ఆయన దర్శనమంటే ఆయన్ని చూడడానికి జనం కిక్కిరిసిపోతుంటారు. ఆరోజు ప్రత్యేకంగా ఎవరితోను మాట్లాడరు. కాషాయవస్త్రాలు.......గడ్డం...........తో చెయ్యి ఆశీర్వదిస్తున్నట్లు సాక్షాత్కరిస్తారు. చుట్టూ శిష్యులుంటారు. భక్తులు ఎన్నో కానుకలు, పళ్ళు, పూలు, డబ్బులు సమర్పిస్తారు. ఆయన పాదాలకి నమస్కారం చేసి, వారి వారి బాధలు విన్నవించుకుంటారు. అవన్నీ శిష్యులు విని వారి బాధలు చీటీలో రాసిమ్మంటే అలానే రాసిస్తారు. శిష్యులు ఆ చీటీలు తీసుకుని స్వామికివన్నీ చెబుతారు. ఫలానారోజు రమ్మని పంపేస్తారు. కొంతమంది చుట్టూచేరి భజనలు చేస్తుంటారు. ఇది వాళ్ళ రోజువారీ దినచర్య. ఈలోగా భక్తులు వాళ్ళ బాధలు చీటీ మీద రాసినవాళ్ళ పేర్లు చదివి, ఫలానా రోజు రమ్మని, పూజలు చేయించాలని వాళ్ళదగ్గిర 5,000, 10,000 వాళ్ళ సమస్యలని బట్టి, స్తోమతులని బట్టి ఇంకా ఎక్కువ కూడా వసూలు చేసి, వాళ్ళు చెప్పిన రోజుకి రమ్మంటారు. ఆరోజు పూజచేసి అక్షతలు, ప్రసాదం......మందులు ఇస్తుంటారు.

మనుషుల బలహీనతలని ఆసరాగా చేసుకుంటూ వాళ్ళనించి డబ్బులు దండుకుంటూ యథేచ్ఛగా కోట్లు కోట్లు సంపాదించి ఇంద్రభవనాలు నిర్మించుకుని తెరవెనక జల్సాగా జీవించే బాబాలకేం కొదవ లేదు మన దేశంలో. వాళ్ళ దొంగవతారాలు బయట పడనంతవరకూ వాళ్ళ వ్యాపారం బాగానే సాగుతుంది. వాళ్ళకి ప్రభుత్వాల అండదండలూ బాగానే వుంటాయి. ప్రజలు కూడా వాళ్ళ బాధలు ఇంట్లోనే అందరూ కలిసి ఐక్యంగా కూచుని సమస్యని పరిష్కరించుకో వచ్చనే ఇంగితజ్ఞానం లేకుండా........ దొంగబాబాల చుట్టూ తిరిగి అనవసరంగా వేలూ, లక్షలూ బాబాపేరుతో వ్యవహరించే ఈ దొంగసన్నాసులకి దోచిపెడుతున్నారు.

అలా...... వినోద్‌బాబా ఒక ఊరికి వచ్చారు. దైవాన్ని, బాబాల్ని నమ్మే ఒక కాలేజి లెక్చరర్ భాస్కరంగారు తన శిష్యుడైన జనార్దనరావనే ప్లీడరింట్లో బస ఏర్పాటు చేయించారు. వారిల్లు బాగా పెద్దదని. ఆయనకో రెండు గదులిమ్మంటే బాబా, వారి శిష్యుల కోసం ఖాళీ చేయించి ఆ రెండుగదులూ ఇచ్చారు. ఇక మర్నాటినుంచి పూజలు, మంత్రాలు, తంత్రాలు..... రోజూ తండోపతండాలుగా వచ్చే భక్తులతో ఆ వీధంతా నిండిపోయింది.

భక్తులందరూ వాళ్ళ వాళ్ళ సమస్యలు ఒక చీటీమీద రాసిచ్చేవారు. వచ్చినవాళ్ళందరూ ఆ బాబా కాళ్ళకి దణ్ణాలు పెట్టడం........వాళ్ళ బాధలు ఈవిధంగా వుండేవి. వాళ్ళ ఆయనకి ఎన్నాళ్ళకీ తగ్గని కడుపునెప్పి, దానికి తోడు తాగుడు బాగా అలవాటు...... ఇంకొక సుబ్బలక్ష్మి అనే ఆవిడ కొడుకు ఎన్నేళ్ళయినా టెన్తులోనే వుంటున్నాడు. ఆ కొడుకుగారికి చదువు బాగా వచ్చి పెద్దఇంజనీరయి, అమెరికా వెళ్ళి డాలర్లు సంపాదించే తన కొడుక్కి కోటి కట్నం తెచ్చే పిల్లనిచ్చి పెళ్ళి చెయ్యాలని ఆ తల్లి జీవితాశయం. ఆ కొడుకే టెన్తు దాటి బైటికి రాలేకపోతున్నాడు. ఈ వినోద్‌బాబా వల్ల ఇంజనీరవుతాడా............? చదవకపోయినా ఆ దద్దమ్మకొడుకు టెన్తు పాసవుతాడా?

ఇంకో సుబ్బలక్ష్మి అనే ఇల్లాలు కూతురికి ఎన్నాళ్ళయినా పెళ్ళి కావటల్లేదట. వచ్చిన సంబంధాలు తిరిగిపోతున్నాయట. ఆ కూతురికి అమెరికా సంబంధం కుదిరి వివాహమైతే తరవాత కూతుర్ని చూడడానికి ఆవిడ కూడ అమెరికా వెళ్ళి, అమెరికా అంతా చుట్టివచ్చి, బంధువుల్లో ఫారిన్ రిటర్న్ డ్ సుబ్బలక్ష్మి అని తనచుట్టూ చుట్టాలని తిప్పుకోవాలని ఆవిడ ఆకాంక్ష............తీరుతుందా ఆమె కోరిక???

ఇంకొక పధ్నాలుగేళ్ళ టెన్త్ చదివే బాలుడి బాధ...ఇంట్లో............తల్లి............తండ్రి...........ఎప్పుడూ కీచులాటలు.......ఎవరూ దెబ్బలాటలో తీసిపోరు. కాబట్టి ఎవ్వరూ తగ్గే ప్రసక్తే లేదు. ఇది చాలదన్నట్టు తండ్రి ఆఫీసుకెడితే , అత్తాకోడళ్ళ దెబ్బలాటలు. పాపం ఆ గొడవలకి అతని చదువు సాగటల్లేదు. అతనికి శ్రద్ధ వుంది. ఎన్ని తెలివితేటలుంటే మాత్రమేమిటి?........ ఇదీ.... ఆ కుర్రాడి సమస్య. ఆ బాబాల వల్లేమన్నా అవుతుందా?

ఇలా అందరి సమస్యలకి .......తగ్గినా, తగ్గకపోయినా వాళ్ళనించి పూజలు చేయించాలంటూ అందరివద్దా దండిగా డబ్బులు వసూలు చేసి, ఏవో పూజలు చేసి కొబ్బరిచెక్కలు, విభూది చేతిలో పెట్టారు.

రాను రాను వాళ్ళకి బస ఏర్పాటు చేసిన జనార్దనరావు గారి పిల్లలకి చదువు సాగక చాలా ఇబ్బంది పడ్డారు. ఇక నెల్లాళ్ళు తిష్ఠ వేసిన వినోద్‌బాబా గారి దొంగవేషాలు బైటపడకుండా, అంకినంతా దోచుకున్నది చాల్లే అనుకుని, మూటా ముల్లె సర్దుకుని అర్ధరాత్రి వేరేచోటికి ఉడాయించారు.

హమ్మయ్య అనుకుని వాళ్ళకిచ్చిన గదులు శుభ్రం చేయించింది జనార్దనరావు గారి భార్య సుమతి. (అసలావిడకి ఈ బాబాలన్నా, పూజలన్నా అస్సలిష్టం లేదు.) మన కర్తవ్యం నిర్వర్తించకుండా, ఈ బాబాల మీద ఆధారపడి పూజలు చేస్తే చదువు వచ్చేస్తుందా? మన పన్లు నెరవేరతాయా? బాబాల కాళ్ళకి మొక్కడాలు.... అతిగా పూజలు చేయడాలు సుమతికస్సలు ఇష్టం లేదు. కర్తవ్యసిద్ధాంతాన్ని వదిలేసి కర్మసిద్ధాంతాన్ని నమ్మేవారు చేసే పిచ్చిపనులు ఇవి.

ఇల్లు శుభ్రం చేస్తూ షెల్ఫులో డబ్బు పెట్టింది పాలవాళ్ళకి, పనిఅమ్మాయికి జీతాలివ్వడానికి. ఆ డబ్బు మాయం! దొంగబాబార్పణం! భాస్కరంగారి మీద స్నేహభావంతోను, గురుభావంతోను అడ్డమైన బాబాలకి ఇల్లివ్వడం......అస్సలిష్టం లేదు సుమతికి.

మర్నాడు పేపర్లలో పెద్దక్షరాలలో వచ్చిన వార్త! దొంగవినోద్‌బాబా గుట్టు రట్టు!! పోలీసులు సోదా చేస్తే ఓ గది నిండా బంగారునగలు, నోట్లకట్టలు.....కొత్త కొత్త చెప్పులజతలు!! బైటపడిన నిజం!!!

**********************

శరభయ్య అనేవాడు చెప్పులు కుట్టుకుంటూ జీవించేవాడు. అతడు మరణించాక కొడుకు వీరేశానికి చెప్పులు కుట్టడమే కాదు, ఏ పనీ రాదు. ఇంటి భారమంతా ఇతనిపై పడింది. తల్లి......, తాత, బామ్మ, చెల్లెలు దిక్కులేని వాళ్ళయారు.

శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలు, మోసాలు అన్నట్టు ఒక గుడి పక్కన చిన్న చెప్పుల దుకాణం తెరిచాడు వీరేశం. తక్కువ రేటుకే మంచి జోళ్ళు అమ్ముతుండేవాడు. గిట్టుబాటు ధరకి తక్కువకి అమ్ముతుండడంతో గిరాకీ పెరిగింది. షాపు పెద్దదయింది. రాబడి పెరిగింది. ఎదురుగుండా వున్న చెప్పుల దుకాణం రాబడి తగ్గిపోయింది. తెలిసిందేమంటే గుడికొచ్చిన వాళ్ళ కొత్త చెప్పులజతలు దొంగిలించి, కొంచెం పాలిష్ పెట్టి తక్కువ ధరకి అమ్మడం. వీరేశం, అతని స్నేహితుడు యాదయ్య మిగతా దేవాలయాల వద్ద....... షాపుల వద్ద మంచి జోళ్ళన్నీ సేకరించి తెచ్చి షాపులో పెట్టేవాడు. ఇలా కొన్నాళ్ళు జరిగాక, తన రాబడి ఏ విధంగా తగ్గిపోతోందో పసిగట్టి, ఎదర చెప్పులదుకాణం యజమాని సుమన్‌లాల్ పోలీసు రిపోర్టిస్తే పోలీసులు కొన్నాళ్ళు జైల్లో పెట్టి వదిలేసారు.

తరవాత వీరేశం వినోద్‌బాబాగా అవతరించాడు.  అతని శిష్యుడు యాదగిరిబాబాగా తయారై వినోద్‌బాబాకి సహకరించాడు.

ఇదీ వినోద్‌బాబా అనబడే చెప్పులబాబా చరిత్ర.  అలా అన్ని పేపర్లలో, టి.వి. ఛానెళ్ళలో వినోద్‌బాబా, యాదగిరిబాబా కలిసి సంపాదించిన ఆస్తులు, బంగళాలు, బంగారాలు, నోట్లకట్టలు, చెప్పులజతలు అన్నీ బైటపడ్డాయి.

చూసిన జనం 'అమ్మో, నా బంగారం, నా డబ్బులు అన్నీ మాయం' అంటూ లబోదిబోమన్నారు.

సద్దు మణిగాక మళ్ళీ ఏ కొత్తబాబాలు వస్తారో!  నమ్మకండి అమ్మలూ, బాబులూ!  బాబాలని నమ్మకండి.

**************

కోరికలకి బానిసలు కావద్దు.  ఇంటోనే మీ సమస్యలు సమిష్టిగా చర్చించుకుని, ఇంట్లోనే అందరూ మీ సమస్యలు పరిష్కరించుకోండి.  ఇగోలు, కోపాలు మానేసి కుటుంబంలో అందరూ ఐకమత్యంతో వ్యవహరించండి.

ఇంట్లో ఎటువంటి గొడవలు పడకుండా కలిసిమెలిసి వుంటే ఏ బలహీనతలు మన దరికి చేరవు.  మీ బలహీనతలని అడ్డు పెట్టుకుని ఏ దొంగబాబాలు అవతరించరు.  ఎవరిమీదా ఆధారపడకుండా స్వయంకృషితో పైకి రండి.

సుభాఛానెల్లో రోజూ ఉదయం సుమతి చెప్పే సుభాషితాల్లో నేటి సుభాషితాలు ఇవి! ................

'ఈ కథ 111 ప్రమదల కథాకేళి పుస్తకం లో ప్రచురింపబడింది.'

❖❖❖❖❖





❖❖❖❖❖



## ఓ ఇల్లాలి పెళ్ళిపుస్తకం

- పెయ్యేటి రంగారావు

' ఏం చెప్పను వదినా! అందరు ఆడవాళ్ళలాగే నాకూ పెళ్ళి అయింది. ఆయనని చూడగానే మా ఆయన బంగారం అని నేను మురిసిపోయాను. ఆయన నా మెడలో పూలదండ వేసేసరికి నా స్నేహితురాళ్ళు అందరూ చప్పట్లు కొట్టారు. ఆయన చాలా బక్కగా వుండేవారు వదినా. నేను ఆయన మెడలో దండ వేసేసరికి, అది ఆయన ఒంటిమీద నిలబడకుండా కిందకి జారిపోయింది. నా స్నేహితురాళ్ళందరూ గొల్లుమని నవ్వేసరికి నేను చాలా సిగ్గు పడిపోయాను. నేను వేసిన దండ కింద పడిపోయేసరికి నాకేదో అపశకునంగా తోచిందమ్మా. తరవాత్తరవాత నా భయం నిజమే అని తేలిపోయింది.




నా బాధలు ఏం చెప్పుకోను వదినా! పెళ్ళైనప్పట్నించీ చూస్తున్నా. మా ఆయనకి పొరుగింటి పుల్లకూర అంటే ఎంతో రుచి. ఐనా ఏం చేస్తాను? ఏళ్ళ తరబడి అల్లాగే సర్దుకు పోతున్నాను.

వదినా! ఒకసారి బాపుగారి సంపూర్ణరామాయణం సినిమాకని బయలుదేరి బస్టాప్ దగ్గర నుంచుంటే, అదెవత్తో టక్కులాడి అక్కడ కనపడింది. అంతే, ఆయన అక్కడ్నించి కదలరు. సినిమాకి టైమయిపోతోంది, రండీ అంటే, ' ఉండు. ఆ అమ్మాయికెంత టెక్కో చూడు. మనకేసి తిరిగి కనీసం ఒక్కసారన్నా నవ్వటల్లేదు. ఆ అమ్మాయి తిక్క కుదిర్చేదాకా నేనిక్కడ్నుంచి కదలను.' అని భీష్మించుకు కూర్చున్నారమ్మా. ఇంక వేరే గతిలేక ఆ పిల్లని ' అమ్మా, ఒక్కసారి మా ఆయన్ని చూసి నవ్వమ్మా' అని బతిమాలాల్సి వచ్చింది. ఏం చెయ్యను మరి? అవతల సినిమా టైమయి పోతోందాయె!



ఆయన ఆగడాలు మరీ మితిమీరిపోతుంటే ఇంక భరించడం నా వల్ల




కాదనిపించిందమ్మా. సతీసుమతి లాగు మహా పతివ్రత అనిపించుకోవడం కన్న, తిరగబడి మా ఆయన్ని దార్లోకి తెచ్చుకోవడమే మంచిదనిపించిందమ్మా. ఆయన ఆఫీసు కాంగానే ఇంటికి రాకుండా బస్ స్టాప్ లో వెధవ్వేషాలేస్తున్నారని అనుమానమొచ్చి, అలా చేసారంటే ముక్కు పిండి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తానని హెచ్చరించాను. అల్లా బెదిరించమని మా పక్కింటి సూరేకాంతమత్తే నాకు సలహా ఇచ్చింది. ఆవిడ నాకు సలహా ఇవ్వడం ఆయన చాటుగా వుండి విన్నట్టున్నారు. నేను హెచ్చరించే సరికి, నన్ను '

పోపోస్, సూరేకాంతం! వ్వె వ్వె వ్వె!' అని వెక్కిరించి వెళిపోయారు.




ఆరోజు మళ్ళీ మామూలు పద్ధతిలోనే ఆలీసెంగా వచ్చారు. నాకు వళ్ళు మండిపోయింది. దాంతో నేనన్నంత పనీ చేసాను. ఆయన లబోదిబోమంటూ నా మీద అక్కసునంతా తన స్నేహితుడి దగ్గర వెళ్ళగక్కుకున్నారు.

సూరెకాంతం అత్తయ్య గారి మూలానె ఇదంతా జరిగిందని ఆవిడ మీద కక్ష పెంచుకున్నారు మా ఆయన. ఒకసారి ఆవిడ మా ఇంటికి వచ్చింది. '



కూచోండి పిన్నిగారూ. మీకు కాఫీ తీసుకు వస్తాను.' అని చెప్పి నేను లోపలికి వెళ్ళాను. లోపల కాఫీ కలుపుతుండగా బైటనించి ప్రళయం వచ్చినంత పెద్ద శబ్దం వినిపించింది. నేను కాఫీగ్లాసుతో హడావిడిగా బైటికి వచ్చి చూద్దును కదా, ఆవిడ కుర్చీలో కూచోబోతుంటే, నా మొగుడు మహారాజుగారు వెనకనించి కుర్చీ లాగేసినట్టున్నారు. ఆవిడ పాపం ఢామ్మని వెల్లకిలా పడిపోయింది.

నాకావేశం ఆగలేదమ్మా. ఆవిడ కుంటుకుంటూ తన ఇంటికి వెళిపోగానే


దూకుడుగా మా ఆయన మీదకెళ్ళి చెయ్యి చేసుకున్నానమ్మా. అప్పుడు కూడా ఆయన తెలివితేటలు చూడు. కాలుస్తున్న చుట్ట అడ్డు పెట్టుకున్నారు. దాంతో ఆ చుట్ట నాకంటుకుని నా చెయ్యి కాలిపోయింది కాని, ఆయనకి కొంచెమైనా దెబ్బ తగల్లేదు.






ఇలా ఆయన ఆగడాలు ఎన్నని చెప్పనమ్మా? వేసంకాలం వస్తోంది, ఒక ఫేను కొని తగలెయ్యండి అని మొత్తుకుంటే, పాతసామాన్ల దుకాణానికెళ్ళి, ఇక్ష్వాకుల కాలం నాటి పంకా కొనుక్కొచ్చి నా మొహాన్న పడేసారమ్మా. అది ఇచ్చే గాలి తక్కువ, చేసే చప్పుడు రెండో ప్రపంచ యుద్ధమంత. నేను ఆయన మీద గయ్యిమన్నాను. అప్పుడు ఆయన నల్లటి ఇంజినాయిలు కొని తీసుకువచ్చి, ఆ ఫేనునిండా ఒంపేసారు. నేను స్విచ్చి వేసుకుందును కదా, మొత్తం ఆ ఆయిలంతా నా మొహం మీద చిందింది. అప్పుడు నా అవతారం గురించి ఏం చెప్పనమ్మా?

ఆయనకి అమ్మాయిల పిచ్చే కాదు, పేకాట పిచ్చి కూడా ఉందమ్మోవ్! ఒకసారేమయిందో తెలుసా? మేము తిరుపతికని బయలుదేరాం. రైలెక్కగానే ఎదర బెర్తులోను, సైడు బెర్తులోను దౌర్భాగ్యులు ఆయనకి దొరికారు. అందరూ కూచుని ఒహటే పేకాట. తిరుపతి స్టేషనులో దిగేసరికి ఆయన వంటిమీద డ్రాయరు తప్ప అన్నీ ఓడిపోయారు. స్టేషనుకొచ్చిన మా తమ్ముడు 'ఏమిటి బావా? మళ్ళీ పేకాట ఆడావేమిటి?' అని అడిగేసరికి సిగ్గుపడి చచ్చాననుకో.




ఆయనతో నాకెప్పుడూ చచ్చే చావేనమ్మా. ఒహటో తారీకు వచ్చింది. '




శ్రీ ముళ్ళపూడి వెంకటరమణగారి 10వ వర్ధంతి సందర్భంగా వారికి స్మృత్యాంజలి




ఏవండీ, ఇవాళ ఒహటో తారీఖు. జీతాలిచ్చే రోజు. పెందరాడే ఆఫీసుకెళ్ళండి ' అని బతిమాలా. రాత్రంతా పేకాడుతూ కూచున్నారో ఏమో, బండ నిద్దరోతూ, ' నేనివ్వాళ ఆఫీసుకెళ్లను, కావాలంటే నువ్వెళ్ళూ' అంటూ ముసుగు తన్నేసారమ్మా. ఇంక చేసేదేముంది?

గత్యంతరం లేక, ఆయన కోటు, ఫేంటు వేసుకుని, నేనే ఆఫీసుకి పరిగెట్టాల్సొచ్చింది. మరి జీతంరాళ్ళు చేతిలో పడకపోతే నెలంతా ఎల్లా గడుస్తుందో నువ్వే చెప్పు వదినా?

ఇల్లాగే ఆయనతో రోజూ నానా అవస్థలూ పడుతూనే ఎభై ఏళ్ళు సంసారం వెలగబెట్టానమ్మా. మరేం చెయ్యను? హిందూపతివ్రత పెళ్ళాన్ని కదా? విడాకుల లాంటివి మనకి చేతకాదు కదా! సంసార జీవితమంటే రాజాలా బతకడం కాదూ, రాజీ పడి బతకడం అని నన్ను నేనే సమాధాన పరుచుకుని, ఆయనతో కాపరం చేసానమ్మా.



నా కష్టసుఖాలన్నీ ఎప్పుడేనా బాపూ అన్నయ్య గారికి, రమణ అన్నయ్య గారికీ చెప్పుకుంటూ వుంటానమ్మా. నాకు వాళ్ళు తప్ప ఆప్తులింకెవరున్నారమ్మా? వాళ్ళు చాలా బాధ పడి, ' ఉండమ్మా. నువ్వు పడ్డ బాధలు నలుగురికీ తెలియాలి. అలా తెలియాలంటే ఒకటే మార్గముంది. ఆడవాళ్ళ కష్టాలకి స్పందించి, ఏమైనా చెయ్యాలని తాపత్రయ పడే అచ్చంగా తెలుగింటి ఆడపడుచు ఒకావిడ మాకు తెలుసు. ఆవిడకి చెబుతాము' అన్నారమ్మా.




అల్లా అని వారంటే నేను ఎవరో అనుకున్నానమ్మా. తీరా ఎవరా అని చూద్దును కదా ఆవిడ పక్కింటి లావుపాటి పిన్నిగారు. ఆవిడకసలే ఆవేశం ఎక్కువ. ఎక్కడైనా అన్యాయం జరిగితే ఎండగట్టేదాకా ఆవిడ ఊరుకోదు. ఇప్పుడావిడ మా ఆయన్ని ఏం చేస్తుందో అని భయంగా ఉందమ్మా. ముందు ఆవిడ్ని కలిసి, ఆవిడని సమాధాన పరచాలి. ఉంటాను వదినా, మళ్ళీ కలుస్తాను.



సుమారు ఎనభై సంవత్సరాల క్రితం దేవలోకపు నందనవనం నించి ఒకే ఒక్క పారిజాత కుసుమం రాలి ఆంధ్రదేశంలో పడింది. ఆ ప్రసూనం రెండు మానవరూపాలుగా పరిణతి చెంది, ఒకటి పశ్చిమ గోదావరి జిల్లాలోని నరసాపురం లోను, రెండవది తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం లోను అవతరించింది. ఆ పారిజాత కుసుమం శ్రీ బాపు గారైతే, ఆ కుసుమం తాలూకు సుగంధం శ్రీ ముళ్ళపూడి వెంకట రమణగారు.

వారిరువురూ ఆంధ్రదేశంలో జన్మించడం మనం చేసుకున్న పూర్వజన్మ సుకృతం. వారిది కళారంగంలో ఒక శకం. ఆ మహానుభావులిద్దరికీ ఈ చిన్ని కథను భక్తిపూర్వకంగా అంకితమిచ్చుకుంటున్నాను.



❖❖❖❖❖

# అమె రి”కరోనా కవి సమ్మేళనం’ కథ

-శ్రీ వంగూరి చిట్టెన్ రాజు, హ్యూస్టన్, టెక్సస్

నేను ఫలానా రోజున సంధ్య వేళ పుట్టి, ఎవడో గిల్లినట్టుగా ఘాట్టిగా గొల్లుమని ఏడ్చాను అని మా అమ్మ చెప్పింది. నాది అనూరాధ నక్షత్రం....నాలుగో పాదం, అనగా వృశ్చిక రాశి అని అప్పటి మా కుటుంబ జ్యోతిష్కుల వారు చెప్పి, జాతక చక్రం వేసి రిటైరై పోయారో, హిమాలయాలకి వెళ్ళిపోయారో కానీ మళ్ళీ ఎవరికీ కనపడ లేదు. అదే ఇంగ్లీషు జాతకం ప్రకారం అయితే మన రాశి “ఎద్దు”. “ఏ రాయి అయితేనేం?”...అంటుంది మా క్వీన్ విక్టోరియా....నిట్టూరుస్తూ!

ఆ మధ్య పట్ట కుతూహలం పట్ట లేక అసలు నాలాంటి పవర్ ఉన్న, లేదా లేని జాతక రాశి డిపార్టమెంట్ లో ఇంకెవరైనా ఉన్నారా అని చూస్తే...వద్దు లెండి..నాకు సిగ్గేస్తుంది. ఎందుకంటే షేక్స్ పియర్ గారూ, మహాకవి శ్రీశ్రీ గారితో సహా చాలా మంది హంసల్లో మనం కాకి లా భాసిస్తాం కదా. అందుకే ఆ సిగ్గు కానీ ఏదో పాత కాలపు పెళ్ళి కూతురు తరహా సిగ్గు కానే కాదు. ఆ మాట కొస్తే మన పవిత్ర భారత దేశ సాంప్రదాయమమైన ‘సిగ్గు” అనే పదార్ధం ఈ రోజుల్లో నిజ జీవితం లో కనపడనే కనపడదు. కావాలంటే పెళ్ళి పీటల మీద సీన్ లో సావిత్రి సినిమా చూడండి, రకుల్ ప్రీత్ సింగ్ సినిమా చూడండి. ఇక అమెరికా వాళ్ళకే కాదు, మరే ఇతర జాతి వాళ్ళకీ అసలు “సిగ్గు” ఉంది అని నేను అనుకోను. అదే లెండి, వాళ్లకి సిగ్గు పడడడం తెలీదనమాట.

ఇంతకీ ఈ రాశీ, గీశీ ఇప్పుడు ఎందుకు ప్రస్తావించడానికి కారణం కేవలం నా “అమృతోత్సవ పుట్టిన రోజు” హడావుడిగా వచ్చి వెళ్ళిపోవడమే కాదు, ఈ మధ్యనే చైత్ర మాసం లో శార్వరీ నామ “కటిక చీకటి” సంవత్సరం వచ్చినప్పుడు ఉండబట్ట లేక, మళ్ళీ కుతూహలం చంపుకోలేక... ఈ యేటి సంవత్సర ఫలాలు ఎలా ఉంటాయో అని చూశాను. యధా ప్రకారం ఆదాయం ఆరు, వ్యయం అరవై అనీ, రాజపూజ్యం అర సున్నా, అవమానం శతమానం అని చూసి అవి అలవాటు అయిన ప్రాణమే కాబట్టి పెద్దగా పట్టించుకో లేదు. కానీ చైత్రమాసం.... అనగా మార్చ్ లో ఉగాదితో కొత్త ఏడాది మొదలు అవగానే ఒకానొక సదరు సిద్ధాంతి మహాశయుల వారు “సదరు తేలు రాశి వారికి కొత్త ఆభరణాలు ధరించే అవకాశం ఉంద” అని వ్రాసిన అంశం నన్ను భలే ఆకర్షించింది. అంటే ఏదో పులి గోరు పతకం, నవ రత్నాల ఉంగరం లాంటివి అనుకుని సంబరపడ్డాను కానీ, ఆయన..అంటే సదరు సిద్ధాంతి గారి దుంప తెగా. ఆ ఆభరణం బంగారం, వెండి తో కానీ కాకుండా కేవలం గుడ్డ పీలిక, లేదా ప్లాస్టిక్ పేపరు తో చేసి పేరు ‘మన మొహానికి తగిలించుకుంటాం అని ఊహించనే లేదు. అసలు ఆభరణాలు అందాన్ని ద్విగుణీకృతం చేస్తాయి కానీ, ఈ సారి నా సొంత దుంప దెగా... .గత రెండు నెలలుగా నా ‘మీస సహిత’ మధురాధర సౌందర్యమూ, ‘సుకుమార’’ నాసికా సౌకుమార్యమూ ఎవరికీ కనపడకుండా ఈ వెధవ మాస్క్ అనే ఆభరణం రోజల్లా పెట్టుకుంటాను అని ఆ రాశిఫలాల రచయిత స్పష్టంగా చెప్పక పోవడం క్షమించరాని నేరం. “నీ అందచందాలా? సరేలే. నువ్వు ఆ మాస్క్ పెట్టుకున్నా, లేకపోయినా పెద్ద తేడా ఏం లేదు.. డోన్ట్ వర్రీ” అని సలహా ఇచ్చింది మా క్వీన్ విక్టోరియా నిట్టూరుస్తూ!

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే....ఈ కరోనా ధర్మమా అని ఒక సరికొత్త సాహిత్యానుభావం అయింది. నిజానికి కవుల్నీ, కథకులనీ, సాహిత్యాభిమానులనీ వ్యక్తిగతంగా కలుసుకుని, హగ్గింగు చేయించుకునీ, చేసుకునీ, అటు వేదిక మీద ఒకానొక మహా వక్త పరమాద్భుతంగా ప్రసంగిస్తూ ఉంటే, అది అర్ధం అవకో, భరించ లేకో, ఎవడి గోల వాడిదే అనుకునో బయట వరండాలోకి వెళ్ళి పోయి, సరిగా అవే కారణాలకి అక్కడ తచ్చాడుతున్న వారితో కబుర్లు చెప్పుకునీ.. ఇలా ఒహటేమిటి...నవరసాలూ సాహిత్య సభలో అనుభవించడం నాకు భలే ఇష్టం. నవరసాలూ అని ఎందుకు అంటున్నానూ అంటే...”ఏ సాహిత్య సభ చూసినా ఏమున్నది అసలు కారణం” అని మహాకవి అన్నట్టు, అక్కడ కొందరు నవ్వుతూ హాస్య రసం, ప్రేమ ఒలకబోస్తూ కొందరు శృంగార రసం, దారుణమైన కవిత్వం చదువుతున్న కవుల మొహం లో ఆవేశ రసం, అది వింటున్న వారిలో దు:ఖ రసం, ఇదెక్కడి

గోడవరా బాబోయ్ అని స్థానిక తెలుగు సంఘం నాయకుల నీరస రసం, ఇలా అన్ని రసాలూ వెతుక్కునే పనిలో నాకు మహానంద రసం లభిస్తుంది....అంతా అయ్యాక మొత్తం బిల్లు కట్టే సమయానికి శోక రసం ఆవహిస్తుంది.

కానీ ఈ కరోనా దౌర్భాగ్యం మూలాన్న కట్టుకున్న పెళ్ళాన్ని కూడా ఆమడ దూరం నుంచే వర్చ్యువల్ గానే ప్రేమించడం, ఇంట్లోనే ఉన్నా పిల్లలు కూడా మూతులు గుడ్డ పీలిక తో కప్పేసుకుని, బహిరంగ సామూహిక సమావేశాలు నిషేధించబడిన ప్రస్తుత పరిస్థితి లో అందరికీ అందుబాటులో ఉన్నది వర్చ్యువల్ సమావేశాలు మాత్రమే. నిజానికి ఇదేమీ కొత్త ప్రక్రియ కాదు. ఈ తరం "ఇంటి చాకిరీ" వాళ్ళకి ..అంటే...."వర్కింగ్ ఫ్రమ్ హోమ్" తరం వాళ్ళ కంపెనీ మీటింగులు అన్నీ కంప్యూటర్ లోనే కదా!. ఆ మాట కొస్తే అనేక దేశాలలో ఉన్న కుటుంబ సభ్యులూ, మిత్రులూ అందరూ చాలా ఏళ్ళనుంచి స్కైప్ లోనో, ఫేస్ బుక్ వీడియో, వాట్సాప్ ఆడియో లలో "ఎలా ఉన్నావు అక్కా" అనో "నువ్వెలా ఉన్నావు, బుజ్జీ" అనో గంటల కొద్దీ మాట్లాడుకుని అభిమానాలు నటించడం అందరికీ తెలినదే. ఇక అలా విడియో అవకాశాలని అలవోకగా సినీ సంగీత శిక్షణ కి అన్వయించి 'స్కైప్ వ్యక్తిగత కోచింగ్ కి గంటకి వంద డాలర్లు", గ్రూప్ శిక్షణ కి 50 శాతం డిస్కౌంట్" అనీ సమాజ సేవ, సంగీత సేవ, కళా సేవ లో తరించే వారు కూడా చాలా మండే వారున్నారు.....క్షమించాలి...అచ్చు పప్పు...."చాలా మండే వారు" కాదు..."చాలా మందే ఉన్నారు" అని పడాలి..అబ్బబ్బ..మరో తప్పు.....అది "అచ్చు పప్పు" కాదు. "అప్పు తచ్చు'....అబ్బా...ఇహ నా వల్ల కాదు...అయ్య బాబోయ్....ఇహ నా వల్ల కాదు.

ఈ కరోనా ధర్మమా అని ఒక అంతర్జాల సాహిత్య సమావేశం లో మొదటి సారిగా పాల్గొనే అవకాశం నాకు కలిగిన సాహిత్యానుభవం భలే తమాషాగా ఉంది. ఎందుకంటే, ఇందులో సాహిత్యం తక్కువా, తమాషా ఎక్కువా అనిపించింది. ఇలాంటివి కేవలం ఆడియో రూపం లో అవధానాలూ, వీడియో రూపం లో కవి సమ్మేళనాలూ అంతర్జాలం లో జరిగినా, అన్నీ యువతరం కంప్యూటర్ వాళ్ళు నిర్వహించిన కారణంగా ఈ తరం మార్పిడి కి సంకేతంగా ఆ తరం వాడిగా నాకు వాటిల్లో పాల్గొనే అవకాశాలు రాలేదు. అనగా....బహుశా ఈ సీనియర్ సిటిజన్ ఎందుకులే అని ఆ జూనియర్లు ఆయా గుంపుల్లో నన్ను చేర్చుకోలేదనమాట. కానీ ఈ సారి ఎందుకో కానీ ఒకానొక అంతర్జాల సాహిత్య సమ్మేళనం లో పాల్గొనడానికి కావలసిన లంకె లూ, పాస్ వర్డ్ లూ గుంపులో గోవింద మైల్ లో వచ్చాయి. అదైనా వక్తలు ఎవరో ముందే ఎంపిక చేసేసుకుని, కేవలం అవి వినడానికి మాత్రమే ఆ అవకాశం నాకు ఇచ్చారు. ఇదేదో బాగానే ఉందే, "వితవుట్ మూవింగ్ బటర్ మిల్క్ ఇన్ ది స్టమక్" హాయిగా ఇంట్లోనే కూచుని సాహిత్యం వినవచ్చును కదా అని సంబరపడి పోయాను. రాముడు మంచి బాలుడి లా లాగ్ ఇన్ అయ్యాను.

అదేమిటో కానీ, వారాల తరబడి కష్టపడి, ఆ వారాల జీతానికి సరి పడా ఖర్చు పెట్టి, ఓ సభా ప్రాంగణమూ, అందులో మైకులూ, కుర్చీలూ, వక్తలకి దండలూ, కొండొకచో చెక్క ముక్కలూ ఏర్పాటు చేసి, ఇ మెయిలూ, వాట్సాపూ, గూగుల్ గుంపులూ, ఫోన్ల లో పిలిచీ బతిమాలగా ఇటు అమెరికాలోనూ, అటు రెండు తెలుగు రాష్ట్రాలలోనూ సాహిత్య సభలకి పాతిక మంది రాగానే "అత్యంత విజయవంతమైన..." "దిగ్విజయంగా జరిగిన.." అంటూ ఆ మర్నాడు పత్రికా ప్రకటనలూ, నిర్వాహకుల ఫోటోలూ చూడడం అలవాటు అయిన నాకు ఈ "గాలి సమావేశానికి" ఏకంగా వంద మంది సదస్సు ప్రారంభం అయిన పావు గంటలో కిచ కిచ లాడుతూ వీడియో ప్రవేశం చెయ్యడం చూసి గుండెలు బాదేసుకున్నాను. అలా బాదేసుకుంటున్న నన్ను ఆ వంద మందీ చూస్తూ నాకు గుండె పోటు వచ్చింది అని అనుకుంటారేమో, నా "గాఢ మిత్రులూ, గూఢ మిత్రులు" కొందరు సంబర పడతారేమో అని కూడా అనుమానం వేసి నా ఓవర్ ఏక్షన్ విరమించుకున్నాను.

ఇక ఈ 'గాలి సాహితీ సమ్మేళనం లో కొన్ని అంశాలు నన్ను బాగా ఆకర్షించాయి. మొదటిది, ఇక్కడ పాల్గొనే వంద మందికీ ఎవరి మైకు వాళ్ళకి ఉంటుంది. అలా అని టీవీలో చర్చావేదికలలో రాజకీయ దౌర్భాగ్యుల లాగా ఎప్పుడు పడితే అప్పుడు మొరగ కుండా ప్రధాన నిర్వాహకుడు అందరి మైకులూ కట్ చేసి నోరు కట్టెయ్య వచ్చును. నాకు ఇలా మా ఇంట్లో నేను ఉండగా

ఎక్కడో ఏ దేశం లోనో ఉన్న ఒకానొక అనామక నిర్వాహకుడు నిశ్శబ్దంగా నా గొంతు నొక్కేయగలడు అని తెలియక చాలా సార్లు బెంగ పడి భంగ పడ్డాను. అయితే ఆ నిర్వాహకుడు గాడిదే కాక, మిగతా వాళ్ళ గొంతు నేను కూడా నా ఇష్టం వచ్చినప్పుడు నొక్కెయ్యగలనా అనేది మరొక సారి ఇలాంటి సమావేశం లో పాలు పంచుకున్నప్పుడు రహస్య ప్రయోగం చేసి తెలుసుకుంటాను.

మరొక తేడా...ఇలాంటి అంతర్జాల సమ్మేళనాలలో మగ పుంగవులు లుంగీలూ, చెడ్డీలూ, అప్పుడప్పుడు చొక్కా మాట దేవుడెరుగు, కనీసం బనీను కూడా వేసుకోకుండానూ, వారిలో కొందరు జంధ్యం తో వీపు గోక్కుంటూనూ కనిపిస్తారు. సరిగ్గా అదే సమయం లో ఆ కవి గారి "మంచి సగం" గారు పట్టుచీర తో, కాసుల పేరు ధరించి సదరు వీపు గోకుడు లో సహాయం చెయ్యక పోగా, అలా కెమేరా కేసే చూస్తూ, తనని ఎవరెవరు చూస్తున్నారా అని గమనిస్తూ ఉండడం నేను గమనించాను. నేను వ్యక్తిగతం గా పాల్గొన్న ఏ సాహితీ సదస్సు లోనూ ఇలాంటి దృశ్యాలు నేను గమనించ లేదు.

ఇక చాలా మంది సభికులు, ఏదో సోఫాలోనో, కుర్చీలోనో కూచుని ఎదురు గుండా బల్ల మీద కాళ్ళు పెట్టుకుని సెల్ ఫోన్ లో మాట్లాడుకోవడం లో కొంత వరకూ నాకు పెద్ద ఆశ్చర్యం కలిగించ లేదు. ఎందుకంటే, మామూలు సదస్సుల లో వేదిక మీద ఒకే ఒక బల్లా, దాని వెనకాల కుర్చీలలో సభాధ్యక్షుల వారూ, ముఖ్య అతిధీ లాంటి ఒకరిద్దరికి మాత్రమే అలా కాళ్ళు బల్ల మీద పెట్టుకునే అవకాశం ఉంటుంది, కానీ సెల్ ఫోన్లలో వేదికని అలంకరించిన పాతిక మందీ ఆ పని చేస్తూనే ఉంటారు. అది అన్ని సభలలోనూ ఎప్పుడూ జరిగేదే!


ఇక మరొక తమాషా ఏమిటంటే, ఏ సభికుడు అయినా తన వెనకాల కనపడే బేక్ గ్రౌండ్ ని మార్చుకునే వెసులు బాటు ఉంటుంది. అది తెలియగానే నేను నా వెనకాల నా గ్రంధాలయం బదులు "ఫలానా సాహిత్య సమ్మేళనం" అనే బేనర్ పెట్టేసుకున్నాను. అంటే, మామూలు సభలలో వెనకాల పెద్ద రంగు రంగుల ఫ్లెక్సీ ఉంటుంది కదా...ఆ ఫీలింగ్ కోసం అనమాట. నా సంగతి సరే....మొన్నటి సమావేశం లో ఒకావిడ మమ్మల్ని ఒక ఆట ఆడేసుకుంది. నాకు తెలిసీ ఆ సుందరాంగి ఏ ఒక్క ప్రసంగమూ విన లేదు కానీ, ఆ గంట లో వెనకాల బేక్ గ్రౌండ్ లో తన కుక్కా, ఆ రోజు తను వండిన చైనా జిగట పదార్ధమూ, బామ్మ, తాతయ్యల ఫొటోలూ, ట్రంపూ, మోదీ కౌగలింతల ఫొటోలూ...వావ్ రెచ్చి పోవడం అంటే...అదే! మరి ఇలాంటి వాటిని ప్రధాన నిర్వాహకుడు ఎలా నివారించగలడో తెలీదు. మామూలు సదస్సుల లో ఇలాంటి దే కాదు, అసలు ఎలాంటి అల్లరి చేసినా సెక్యూరిటీ వాడిని పిలిస్తే చాలు, బుద్ధిగా ఉంటారు.

ఇలా రాసుకుంటూ పోతే చాలా తమాషాలు ఉన్నాయి కానీ....అవన్నీ మరో సారి ముచ్చటించుకుందాం. ఏది ఏమైనా, ఈ కరోనా ధర్మమా అని రాబోయే సాహితీ సదస్సుల రూపు రేఖలు పూర్తిగా మారిపోతాయి. ఆ మాటకొస్తే.... మా తానా వారు, ఆటా వారు...స్థానిక హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి లాంటి అనేక తెలుగు సంఘాలూ ఈ "రుచి మరిగి" వారి జాతరలు ఎలా నిర్వహిస్తారో చూడాలి...

❖❖❖❖❖


# గిన్నీస్ బుక్ విజేత – (విజయాల) విజయ నిర్మల

శ్రీ ప్రసాద్ రాంభట్ల, సిడ్నీ




తెలుగు సినిమా ప్రపంచంలో ధృవ తారగ వెలుగొందిన నటీమణుల్లో విజయ నిర్మల గారు ఒకరు. విజయ నిర్మల అంటే తెలుగువారికి పరిచయం అవసరంలేని పేరు. బాలనటిగా,కథానాయకిగా, దర్శకురాలిగా, నిర్మాతగా బహుముఖప్రజ్ఞాశాలి. బాల్యం నుంచే నటన మీద ఆసక్తి ఉండడంతో నటనామెళకువలు నేర్చుకొని మరెందరికో నటన నేర్పించి, అత్యధిక సినిమాలకు దర్శకత్వం వహించి దర్శకురాలిగా **గిన్నీస్ బుక్** లో స్థానం సంపాదించి, తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పారు. విజయ నిర్మల 20-02-1946 లో బ్రహ్మణకుటుంబంలో తమిళనాడులో జన్మించారు. తండ్రి శ్రీ రామోహన్ రావు స్వస్థలం చెన్నై మరియు తల్లి శ్రీమతి. శకుంతల గుంటూర్ జిల్లా నర్సరావుపేట. చిన్నప్పటినుంచి చలాకీగా ఉండడం గమనించి తల్లి-తండ్రి విజయనిర్మలకు భరతనాట్యంలో శిక్షణిప్పించారు.విజయ నిర్మల అసలు పేరు నిడుదవోలు నిర్మల. విజయ నిర్మల తండ్రి, **విజయ వాహిని స్టూడియోస్** లో సౌండ్ ఇంజినీర్ గా పనిచేసేవారు. విజయ వాహిని స్టూడియో లో సినీ ప్రస్థానం మొదలుకావడంతో అందుకు గుర్తుగా పేరుకు ముందు విజయ చేర్చుకున్నారు దాంతో విజయ నిర్మలగా మారింది.
1950 లో తన ఏడవ ఏట బాలనటిగా "**మత్స్యరేఖ**" అను తమిళచిత్రంలో మొట్టమొదటిసారి నటించారు. పదకొండవ ఏట **పాండురంగ మహత్యం** చిత్రంలో బాల కృష్ణుడిగా నటించి తెలుగు చిత్ర పరిశ్రమకి పరిచయం అయ్యారు. 1964 లో విజయ నిర్మల తండ్రి స్నేహితుడు విన్సెంట్ అనే కెమెరామన్ విజయ నిర్మలని చూసి తన మొదటిసారి దర్శకత్వం వహించిన మలయాళం చిత్రం – "**భార్గవి నిలయం**" విజయ నిర్మలను కథానాయకిగా తీసుకున్నారు. భార్గవ నిలయం చిత్రం ఎడిటింగ్ వాహిని స్టూడియోస్ లో జరగడంతో బి.ఎన్.రెడ్డి గారు విజయ నిర్మల గారి నాటనకి ముగ్ధుడై, తను తీయబోయే చిత్రానికి కథానాయకిగా పెట్టుకోవాలని విజయ నిర్మలను ఇంగ్లీషులో అడుగగా- నేను తెలుగు అమ్మాయిని అండి, మీ స్టూడియోస్ లో సౌండ్ ఇంజినీర్ గా పని చేస్తున్న రామ్మోహన్ రావు గారి అమ్మాయిని అని చెప్పింది. బి.ఎన్. రెడ్డి గారు వెంటనే రామ్మోహన్ గారిని సంప్రదించి 1966 లో తెలుగు చిత్ర పరిశ్రమలో విజయ వాహిని వారి "**రంగులరాట్నం**" చిత్రం ద్వారా తొలి సారి కథానాయకిగా ఆరంగేట్రం చేశారు. బి.ఎన్.రెడ్డి గారు నిర్మించి దర్శకత్వం వహించిన "**రంగులరాట్నం"** చిత్రం ఆ ఏడాది రాష్ట్ర ఉత్తమ చిత్రంగా బంగారు నంది పురస్కారం సాదించింది. ఆ తరువాత విజయ నిర్మల దాదాపు 200 పైగా తెలుగు, తమిళ, మలయాళ చిత్రాల్లో తనదైన నటనతో మెప్పించారు.






విజయ నిర్మల వివాహం మొదట కృష్ణమూర్తి – సెట్ డిజైనింగ్ ఇంజినీర్ తో జరిగింది. వీరికి నటుడు నరేశ్ కుమారుడు. వీరిద్దరికి విబేదాలు రావడంతో వారు విడిపోయారు. ఇక విజయ నిర్మల, సూపర్ స్టార్ కృష్ణను 1969 లో రెండవ వివాహం చేసుకున్నారు

1967 లో సాక్షి చిత్రంలో కృష్ణకు జోడిగా నటించారు, మరియు మంచి విజయం సాధించింది. తదుపరి కృష్ణ, విజయ నిర్మల జంటగా వచ్చిన చిత్రాలు సూపర్ హిట్ గా నిలిచాయి. వీరిరువురు దాదాపు 50 చిత్రాలు కలిసి నటించారు. తెలుగు చిత్ర పరిశ్రమలో ఒక కథానాయకుడు, కథానాయకి జంటగా 50 చిత్రాలు చేయటం రికార్డు.




హీరో కృష్ణతోనే కాదు, అలనాటి నాగేశ్వర రావు గారు, ఎన్.టి.ఆర్ గారు సరసన నటించి మెప్పించారు విజయ నిర్మల. విజయ నిర్మల దాదాపు 100 చిత్రాలు పూర్తియయిన తరువాత దర్శకత్వం చేయడానికి నిర్ణయించుకున్నారు, కృష్ణ గారు విజయ నిర్మలను ముందుగా మలయాళంలో తీయమని సలహాయిచ్చారు, కృష్ణ విజయ నిర్మల కలిసి "**సంగం మూవీస్**" అని కొత్త బ్యానర్ పెట్టి "కవిత" అనే చిత్రాన్ని 3 లక్షల రూపాయలతో మలయాళంలో తీశారు. ఈ చిత్రం హిట్ అవ్వడంతో, తెలుగులో దర్శకత్వం చేయాలని నిర్ణయించుకున్నారు. యద్దనపూడి సులోచన రాణి గారు వ్రాసిన "**మీనా**" నవలను తీయాలని నిర్ణయించుకున్నారు. కృష్ణ, విజయ నిర్మల కలిసి "**విజయ కృష్ణ ఫిల్మ్స్**" స్థాపించి, ఇరువురు కలిసి నటించి విజయ నిర్మల దర్శకత్వం వహించిన చిత్రం "**మీనా**". ఈ చిత్రం అధ్భుత విజయం సాధించింది. ఈ సంస్థ ద్వారా విజయ నిర్మల15 పైగా చిత్రాలను నిర్మించి దర్శకత్వం వహించారు. ఈ సంస్థలో వచ్చిన చిత్రాలు- కృష్ణ గారి దేవదాసు, ముక్కోపి, అంతం కాదిది

ఆరంభం, వాడిన మాట, నేరము-శిక్ష చిత్రాలు సూపర్ హిట్. అంతేకాదు దర్శకురాలిగా మొదటి చిత్రం “మీనా” అందులో కథానాయకుడు కృష్ణ, ఆఖరు చిత్రం దర్శకత్వం వహించిన చిత్రం “నేరము-శిక్ష” లో కూడా కథానాయకుడు కృష్ణ. తెలుగులో 40కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించిన విజయ నిర్మల, ఈమె ఘనతను గుర్తించిన గిన్నీస్ బుక్ వారు ప్రపంచంలో అత్యధిక చిత్రాలకు దర్శకత్వం వహించిన మహిళగా, విజయ నిర్మల పేరును గిన్నీస్ రికార్డ్స్ కు ఎక్కించారు.




చిత్రపరిశ్రమకు తను చేసిన సేవలకుగాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2008లో రఘుపతివెంకయ్య పురస్కారంతో సత్కరించింది.



సామాన్య నటిగా చిత్ర పరిశ్రమకు వచ్చి నిర్మాతగా, దర్శకురాలిగా బహుముఖప్రజ్ఞ చాటిన అరుదైన మహిళ విజయ నిర్మల. నేడు వస్తున్న మహిళ దర్శకులకు ఆమె మార్గదర్శి అనడంలో ఎలాంటి సంశయంలేదు.

❖❖❖❖❖








**దేవాలయాలు సనాతనధర్మ పరిరక్షక నిలయాలు, కాపాడుకుందాం.**

# కళాతపస్వి

-శ్రీమతి విజయ గొల్లపూడి, సిడ్నీ



ఒక ఉత్తుంగ హిమవన్నగం, సినీదర్శకుడు బి. ఎన్. రెడ్డిగారి వెనకాల ఉంటూ, నిక్షిప్తమై, తెర వెనుకనే మరుగున ఉంటూ, నిగూఢంగా కాలక్షేపం చేస్తూ వచ్చింది. కానీ తనకు స్వేచ్ఛ లభించి స్వతంత్రంగా దర్శకత్వ బాధ్యతలు చేపట్టే స్థాయికి చేరుకునేసరికి ఇంక ఆ హిమవన్నగమే మేరు నగధీరుడై యావత్ ఆంధ్ర దేశానికి ఒక పెద్ద కెరటంలా వచ్చి కుదుపు కుదిపేసిన ఆ ధీశాలి ఎవరో కాదు, "కళాతపస్వి" కాశీనాధుని విశ్వనాథ్.

ఈ రాగాలేమిటిరా బాబు? ఈరోగాలేమిటో, సంగీతాలేమిటో అని సామాన్య జనం సంగీత ప్రపంచాన్ని విసుక్కుంటూ పాప్ మ్యూజిక్, జాజ్ మ్యూజిక్ల వైపు మ్రొగ్గు చూపుతున్న తరుణంలో, ప్రేక్షకులు ఆదరిమ్చ్రురుగాక ఆదరించరు అని అందరూ నిరుత్సాహపరుస్తున్న పరిస్థితులలో, శాస్త్రీయ సంగ్తీతాన్ని ఆధారంగా తీసుకుని, అద్భుతమైన కళాఖండాన్ని సృష్టించి తనేమిటో, తన ప్రతిభ ఏమిటో కేవలం ఆంధ్రదేశానికే గాక, అంతర్జాతీయంగా చాటి చెప్పిన దర్శక బ్రహ్మ శ్రీ విశ్వనాధ్ గారు. శంకరాభరణం విడుదలైన మొదటి రోజులలో కలెక్షన్స్ అంతంత మాత్రంగానే నడచినా చూస్తూ చూస్తూ ఉండగానే సాధారణ జనాలలో సంగీతంపై ఆసక్తి మక్కువ పెరిగి విపరీతమైన కలెక్షన్స్ బాక్సాఫీస్ వద్ద పెరుగుతూ వచ్చాయి. అక్కడి నుంచి మొదలైన ఆ విశ్వనాధుని జైత్రయాత్రలో వెనకడుగు వేసే ప్రసక్తే లేకుండా తేజోమాన విరాజితుడై రాకెట్ వేగంతో సినీ వినీలాకాశంలోకి ముందుకు సాగిపోతూ వచ్చారు. ఆయన దర్శకత్వం చేపట్టిన ఒక శంకరాభరణం ఏమిటి, ఇంకో స్వర్ణకమలం ఏమిటి మరో స్వయంకృషి ఐతేనేమి ఒక్కొక్క చిత్రం ఒక్కో ఆణిముత్యం, అమూల్యమైన మణిపూస.

ప్రేక్షకులు ముక్కున వేలేసుకుని, ఎవరా విశ్వనాధ్ అని అడిగితే, రుద్రుడై చలనచిత్ర సీమలో శివతాండవం చేస్తూ భారతీయ కళలపై, సంస్కృతి, సంప్రదాయాలపై, శాస్రీయ సంగీతం పై అద్భుతమైన అవగాహన, అభిరుచి జనావళిలో కల్పించి, నవశకానికి నాంది పలికిన యుగపురుషుడిగా విశ్వనాధ్ గారిని చెప్పుకోవచ్చు. ఆయన శంకరాభరణం చిత్రం తీసిన తర్వాత మన 'కర్ణాటక సంగీతం'పై ఆదరణ కలిగి, పిల్లలకి సంగీతం నేర్పించే పరిస్థితికి తీసుకువెళ్ళిన గొప్ప వ్యక్తి విశ్వనాధ్ గారు.







ఒక్కొక్క దర్శకుడు ఒక్కొక్క రీతిలో తమదైన బాణిలో ప్రతిభాపాటవాలు కనపరిచారు. కానీ మన విశ్వనాథ్ చిత్రాల దగ్గరికి వచ్చేసరికి శాస్త్రీయ సంగీతం, నృత్య కళలు, భారతీయ కళల ఔన్నత్యం వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ఏమాత్రం అశ్లీలతకు, చవకబారు హాస్యానికి తావివ్వకుండా తనదైన బాణిలో నటులందరిని నటింపచేస్తూ, సామాన్య జనావళిలోకి తీసుకెళ్ళి మెప్పించి, చెరగని ముద్ర వేసినమేధావి విశ్వనాధ్ గారు అని చెప్పటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

'ఆత్మగౌరవం' ఆయన దర్శకత్వం వహించిన మొట్టమొదటి చిత్రం. ఆ తర్వాత 'సిరిసిరిమువ్వ' చిత్రంతో అంచెలంచెలుగా మరింత చేరువగా జనాలలోకి దూసుకుని వెళ్ళారు. శంకరాభరణం, సాగరసంగమం, శృతిలయలు, సిరివెన్నెల, స్వర్ణకమలం, స్వాతికిరణం వంటి చిత్రాలు కళాత్మక విలువలకు అద్దం పట్టిన చిత్రాలైతే, సప్తపది, స్వాతిముత్యం, స్వయంకృషి చిత్రాలు సామాజిక విలువలతో మరో కోణంలో సగటు మానవుని ఆలోచింపచేసే విధంగా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇవేకాక శుభలేఖ చిత్రంలో సామాజిక వరకట్న దురాచారాన్ని వేలెత్తి చూపారు. ఆయన దర్శకత్వం వహించిన స్వాతిముత్యం చిత్రం భారతీయ చిత్రసీమలో ఆస్కార్ అవార్డ్ కి నామినేట్ చేయబడింది.

విశ్వనాథ్ గారి చిత్ర విజయ కిరీటంలో రత్నాలుగా పొదగబడిన అవార్డులు:

1980-జాతీయ ఉత్తమ కుటుంబకథా చిత్రం –శంకరాభరణం,1982-నర్గీస్ దత్ జాతీయ సమైక్యతా ఉత్తమచిత్రం – సప్తపది,1984- జాతీయ ఉత్తమ చలనచిత్రం – సాగరసంగమం,1986 - జాతీయ ఉత్తమ చలనచిత్రం - స్వాతిముత్యం

1988 - జాతీయ ఉత్తమ చలనచిత్రం – శృతిలయలు,2004 - జాతీయ ఉత్తమ చలనచిత్రం - స్వరాభిషేకం

1992 - రఘుపతి వెంకయ్య పురస్కారం,1992 - పద్మశ్రీ పురస్కారం,2016- దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం

విశ్వనాథ్ గారు దర్శకత్వం చేపట్టిన అన్ని చిత్రాలలో పాటలన్నీ సంగీత పరంగా సామాన్య ప్రేక్షకునికి కూడా ఇష్టమయ్యేలా రంజింపచేస్తూ, సంగీతానికి మరింత చేశాయి. కు విశ్వనాథ్ గారు అందించిన ప్రతి చిత్రం ఒక వరం, మదిలో మరపురాని అద్భుతమైన సృష్టి.

తెనాలిలో శ్రీ కాశీనాధుని సుబ్రహ్మణ్యం, సరస్వతమ్మలకు ఫిబ్రవరి 19,1930 జన్మించిన విశ్వనాథ్ ఆ కళామతల్లికి ముద్దుబిడ్డ. దర్శకు కాక యస్.పి బాలసుబ్రహ్మణ్యం నిర్మాతగా చేపట్టిన 'శుభసంకల్పం' చిత్రంలో బాలు ప్రోద్బలంతో రాయుడి పాత్రలో తెరంగేత్రం చేసి విశ్వనాథ్ మరోకోణంలో తనలోని ప్రతిభను ప్రేక్షకుల ముందుంచారు. ఆపై మరిన్ని తెలుగు, తమిళ, హిందీ చిత్రాలు ఆ నటుని కోసం క్యూ కట్టాయి.

తెలుగు చిత్రసీమకే గాక, భారతీయ చలనచిత్రప్రపంచంలో కూడా ప్రత్యేక గుర్తింపుని పొందిన విశ్వనాథ్ గారు మన తెలుగువారంతా గర్వించదగ్గ ఈ శతాబ్దపు అద్భుతమైన వ్యక్తి.

❖❖❖❖❖

# అందమాను "అండమాను" (కవిత)

శ్రీ గొర్తి వేంకట సోమనాథ శాస్త్రి(సోమసుధ),హైద్రాబాద్

భారత తీర భాగమంతా రకరకాల కాలుష్యాలు నిండుకొన్నందున సముద్ర మధ్యానికి పోవాలన్న కోరికతో 2015లో అండమాను ద్వీపాలకు వెళ్ళాను. అక్కడకెళ్ళాక 'అవి ద్వీపాలు కావు, మసకబారిపోతున్న మన భారతీయ సంస్కృతిని పొరుగున ఉన్న యితర ఆసియా దేశాలకు చూపించటానికి వెలిగించిన దీపాలు'గా కనిపించాయి. వాటి రూపాలను కొద్ది కొద్దిగా నా భావతరంగాలతో మీ ముందు ఉంచుతున్నాను.

ఎన్నెన్నో ద్వీపాలు - ప్రకృతి ప్రతిరూపాలు
కడలి తీర చెలువులు - జలచరాల కొలువులు
అందమాను "అండమాను " చందమిది !
కడలి నడుమ ఉదయించిన చంద్రమిది !!

కన్నుల కింపొనరించే వనాలతో
ఆహ్లాదపు ఆటపట్టు "పవనాలతో"
నలుదెసలా కందళించు దవనాలతో
జలవేదిని సందడించు కవనాలతో
అందమాను " ఆండమాను " చందమిది !
జలధి నడుమ ఉదయించిన చంద్రమిది !!

ద్వీపాలను ముడివేస్తూ కదలాడే నావలు
విహారులను చేరవేయు విమానాల త్రోవలు
రంగులీను రాళ్ళకు నెలవైన దీవులు
తీపి రుచుల చవిజూపే నారికేళ తావులు
అందమాను " ఆండమాను " చందమిది !
జలధి నడుమ ఉదయించిన చంద్రమిది !!

ఆంగ్లేయుల వేధింపుకు అల్లాడిన జాతులు
జపనీయుల దాడులకు సాక్ష్యమైన గోతులు
"సెల్యులారు" ముంగిటిలో మలిగినట్టి నేతలు
త్యాగానికి ప్రతీకలై వెలుగుతున్న జ్యోతులు
అందమాను "అండమాను" చందమిది !
జలధి నడుమ ఉదయించిన చంద్రమిది !!

ఉప్పు కడలి ఉనికి యైన వివిధ జలచరాలు
నుతి మెత్తని యిసుకతో అలరించే తీరాలు
పసి హృదయాలను ఊపే నీటిలోని క్రీడలు
చైతన్యం వెల్లివిరియు విహారుల వాడలు
అందమాను "ఆండమాను" చందమిది !
జలధి నడుమ ఉదయించిన చంద్రమిది !!

❖❖❖❖❖

## తెలుగువాణి

*Radio 2TripleO FM 98.5MHz*

*8 -10AM on Saturday – Sydney Time*
*2.30 -4.30 AM on Saturday - India Time*
*(Please check for equivalent Local time@ your place)*

*Listen to Teluguvani on Radio 2Triple O FM 98.5MHz or DAB 985 or Listen audio by dialing: +61 2 8080 5650 Or Tunein App on Android / iPhone*

*Follow the links below :*

*https://Radio2tripleo.com.au*
*http://s7.viastreaming.net/8500/m*
*https://www.facebook.com/telugu.vani.52*

ఈవారం ప్రశ్న సమాధానం: *Please click the link below:* *https://www.sydneytelugu.org/resources/evaram-prasna*

*Mrs Raja Tallapragada – Convener*

*Mr Chandrasekhar Raghavaraju -Coordinator*

*Mr Sai Gollapudi - Coordinator*

*For sponsorship and other details contact : Convener on 0422 953 668 or*


*Email: vani@sydneytelugu.org*

❖❖❖❖❖






❖❖❖❖❖


ఎప్పుడైతే నువ్వు నాకు చాక్లెట్టిచ్చి మళ్లీ
"నా చాక్లెట్ నాకిచ్చెయ్" అని లాక్కున్నావో
అప్పుడే నా మనసు విరిగిపోయింది – ఇహ
అది అతుక్కోదు – సారీ సీతా....
Malik



దీనికి తిట్లన్నీ నువ్వే నేర్పావా?!...
ఒరేయ్ వెధవాయ్
Malik

❖❖❖❖❖


Private courtyard available upto 50 people
Catering available
Royal
Paradise Biryani
Royal
Paradise Biryani
02 9763 5282
reservations@royalparadisebiryani.com.au
14 George Street North Strathfield
NSW 2137.

# సంగీత నాదామృతం

-డా. పద్మ మల్లెల, సిడ్నీ



## కీర్తన

ఇంత వరకూ మనం సంగీత రచనలలో గీతం, జతిస్వరం, స్వరజతి మరియు వర్ణం అనే రచనల గురించి తెలుసుకున్నాం కదా! ఇక ఇప్పుడు కర్ణాటక సంగీతానికి మూలస్థంభమైన కీర్తన అనే రచన గురించి తెలుసుకుందాం. కీర్తన అనే రచనకు ఆద్యుడు అన్నమాచార్యులవారు.

వీరు కొన్నివేల సంకీర్తనలతో ఈ రచనకు పునాది వేశారు.తరువాత సంగీత త్రిమూర్తులైన శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామి మరియు దీక్షితుల వారు ఈ సంగీత రచన కు ఒక చక్కని రూపకల్పన చేశారు. కీర్తన లో సంగతి అనే అంశాన్ని ప్రవేశ పెట్టిన వారు శ్రీ త్యాగరాజస్వామి వారు.

ఇక ఈ కీర్తన అనే సంగీత రచన స్వరూపం పరిశీలిస్తే ఇందులో పల్లవి, అను పల్లవి మరియు చరణం అనే విభాగాలుఉంటాయి.కీర్తన అనే రచనలో సంగీతం ఎక్కువ సంక్లిష్టం గా కాక కొంచం సులభతరంగా ఉంటుంది. సాహిత్యం, భక్తి, భావంతో ఉంటుంది. ఈ కీర్తన మరియు తరువాత ప్రస్తావించబోయే కృతి అనే సంగీత రచనలో ధాతు మాతు అనే అంశాలు ఉంటాయి. ధాతు అంటే కీర్తన ఆ రాగం లో ఎటువంటి స్వర సమూహం తో పాడటమో లేక వారించటం చెయ్యాలో తెలియ జెప్పేది ధాతు అంటారు. ఇక కీర్తన లేక కృతి లోని ఈ స్వరానికి తగ్గ సాహిత్య భాగాన్ని మాతు అంటారు. ఇక కీర్తన లో ని ఇతర అంశాలను పరిశీలిస్తే ముఖ్యంగా పల్లవి, అనుపల్లవి మరియు చరణం అనేభాగాలు ఉంటాయి. ఈ మూడు భాగాలకు సాధారణం గా వేరే వేరే ధాతు అంటే సంగీత కూర్పు ఉంటుంది.

ఉదాహరణకి శ్రీ రఘుకుల అనే హంసధ్వని రాగ కీర్తన లో 3 విభాగాలు వేరే ధాతు కలిగి ఉంది. ఇలా వేరే వేరే ధాతు కల కీర్తనలను ద్విధాతు కీర్తనలంటారు. అతి ప్రసిద్ధమయిన దీక్షితుల వారి నాట రాగ కీర్తన మహాగణపతిం కూడా ద్విధాతు కీర్తనే. అయితే మనందరికీ చిరపరిచితమయిన పవనజ స్తుతి పాత్ర అనే కురంజి రాగ దివ్య నామ కీర్తన లో పల్లవి మరియు చాలా చరణాలు ఉన్నప్పటికి అన్నీ ఒకే ధాతు కలిగి ఉంది కనుక దాన్నిఏకధాతుకీర్తనఅంటారు.

ఈ దివ్య నామ మరియు ఉత్సవ సంప్రదాయ కీర్తనలు త్యాగరాజస్వామి సంగీత ప్రపంచానికి ఇచ్చిన అద్భుతమయిన వరంగా చెప్పుకోవచ్చు. ఇవి కొన్ని చాలా సులభతరమయిన శైలిలో సంగీతంలో

ప్రాధమిక స్థాయి లో ఉన్నవారు కూడా పాడి లేక వాయించ గలిగే తీరు లో ఉంటాయి. ఉత్సవ సాంప్రదాయకీర్తనలుఅంటేరోజుపూజ లో చేసేఉపచారాలకు తగినట్లు ఉంటాయి. అంటే ఉదాహరణకి నైవేద్యానికి ఆరగింపవే అనే తోడి రాగ కీర్తన, విడెము సేయవే అనే కీర్తనతాంబూల చర్వణానికి మొదలయినటువంటివన్నమాట.

ఇకదివ్య నామకీర్తనలు అన్నమయ్య, పురందరాదులు మొదలు పెట్టిన భజనసంప్రదాయానికి తగినట్లుఉంటాయి.ఉదాహరణకి నగుమోముగలవాని మొదలయినవి. ఇక అన్నమయాదిగా కల మిగతా వారి రచనలు ఏవయితే ఒక్క రచనలు మాత్రమే సంగీత కూర్పు లేకుండా లభ్య మయినాయో వాటిని కీర్తనలుగానే చెప్పాలి వాటిని కృతులుగా పేర్కొనకూడదు.

ఇక కృతి అనే సంగీత రచన కీర్తనను పోలిఉన్నప్పటికీ కర్ణాటక సంగీతంలోనిఅతిసంక్లిష్టమయినరచన.ఈకృతులనుప్రదర్శించటానికి సంగీతం లో మంచి సాధన పరిజ్ఞానం అవసరం. ఇక కీర్తనకు కృతికి ముఖ్యమైన తేడా కృతిలో చాలా క్లిష్టమయిన సంగతులు ఉంటాయి. ఈ సంగతి అనే ప్రక్రియ ప్రవేశపెట్టిందిత్యాగరాజస్వామి. కొన్ని కృతులలో త్యాగరాజస్వామివారు దరిదాపుగా 40సంగతులున్నాయనిసాంబమూర్తి గారు ఒక పుస్తకంలో పేర్కొన్నారు. అయితే పూర్వం సంగీత కచేరీల నిడివి చాలాఎక్కువ గా ఉండటం వల్ల అన్ని సంగతులు ప్రదర్శించే వీలుండేది. కానీ ఇప్పుడు కచేరీ ప్రదర్శనల నిడివి తగ్గి కొన్ని పెద్ద కృతులను ప్రదర్శించడ అవకాశం తగ్గిపోయి చాలాకృతులు మరుగున పడిపోతున్నాయి. ఇక ఈ కృతులలో మామూలుగ ఉండే విభాగాలతో పాటు ఇంకా చాలా అలంకారిక విభాగాలు ఉంటాయి. వాటిగురించి వచ్చే సంచికలో తెలుసుకుందాం.

ఇప్పుడు త్యాగరాజస్వామివారికీర్తనగురించిచర్చించుకుందాం.
చక్రవాక రాగంలోని ఎటులబ్రోతువో తెలియ అనే కృతి సాహిత్యం ఈ క్రింది విధంగా ఉంది.

**పల్లవి:**

ఎటుల బ్రోతువో తెలియదేకాంత రామయ్య

**అనుపల్లవి:**

కట కటా నా చరితము కర్ణ కఠోరమయ్యా ||ఎటుల||

**చరణం:**

వట్టి గొడ్డు రీతి భక్షించి తిరిగితి

పుట్టులోభులను పొట్టకై పొగిడితి

దుష్టులతో గూడి దుష్కృత్యములు జేసి

రట్టు జేసిన త్యాగరాజుని దయతోను || ఎటుల||

ఈ కృతి అయ్యవారు ఆత్మనింద అనే కవితా సొబగు తో చేశారు. ఆత్మనింద అంటే తనలోని తప్పులను స్వామి వారికి నివేదించుకుని

అటువంటి తప్పులను చేసిన తనని ఆయన ఎలా రక్షిస్తారో అనే ఒక ఆర్తిని ఏకరువు పెట్టారు. ఇంకా ఈ కీర్తన ఆసాంతం టకారప్రాసఉంది.

ఇటువంటి టకార ప్రాస తో సాహిత్యం కూర్చడంఒకకష్టమయినప్రక్రియ

కనుకఇటువంటిసాహిత్యాన్నిత్యాగరాజస్వామివారిఆరాధనసందర్భంగా తలుచుకుంటూ మళ్ళీ వచ్చే సంచికలో కలుసుకుందాం. ఈ కీర్తన ఆలతూర్ సోదరుల గళంలో క్రింద లింకు ద్వారా విని ఆనందించండి.

https://www.youtube.com/watch?v=8NFwcExG9f0

❖❖❖❖❖

WESTMEAD DOCTORS



Shop 6, Coles Complex
29-33 Darcy Road
WESTMEAD

PH: 9687 4000
WESTMEADDOCTORS.COM.AU

Open 7 days

BULK BILLING AVAILABLE

GENERAL PRACTICE

Telugu and
Hindi speaking
Female GPs
Male GPs

ALLIED HEALTH

Psychologist
Physiotherapist
Podiatrist
Dietitian

SPECIALISTS

Paediatricians
Adult Physician
Geriatrician
Cardiologist

ONSITE PATHOLOGY


Dr. Murali Thiruvengadam
MBBS, FRACGP
Principal GP, Conjoint Lecturer
Western Sydney University
Fluent in:
Hindi, Tamil, Telugu, Malayalam
RRMC RAILWAY ROAD MEDICAL CENTRE
QUALITY COMMUNITY CARE
P: (02)88891383 | F: (02)86254326
Bulk Billing
OPEN 7 DAYS
New Medical Centre at
Quakers Hill
Mon - Fri: 8.00am - 8.30pm
Sat: 8.00am - 6.00pm
Sun: 8.00am - 12.00pm
G02 / 25 Railway Road
Quakers Hill, NSW-2763
88891383
Fax: 86254326
www.railwayroadmedical.com.au

# వాహిని పాఠకుల స్పందన

కొత్త సంవత్సరంలో వాహిని సంచిక ఎప్పటిలాగే ముస్తాబై వచ్చింది.

లలిత రాంభట్లగారి సంక్రాంతి పండుగ వివరాలు చాలా బాగున్నాయి.

అనురాధ, శ్రీదేవి గార్ల ముగ్గులు చూడ ముచ్చట గా వున్నాయి.

డా.కె.టి పద్మజ గారి గజల్ -వ్యక్తిత్వ వికాసం నన్నెంతో ఆకట్టుకుంది.

"అనుభవాల నాగళ్ళు దుక్కి దున్ననిదే పండదు మానసం" ఎంత చక్కని భావన!

"పుట్టినపుడే ఏదీ వువ్వెత్తున ఎగరదు

చేయూతని మరిచిపోయి దొంగాటలాడకు" కృత జ్ఞతా పూర్వకంగా వుండాలనే బోధ యిది.

మొత్తానికి వాహిని వివిధ ఆకర్షణీయ శీర్షికల తో చూడముచ్చటగా వుంది.

శ్రీమతి విజయ చావలి, సిడ్నీ

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వారి ముఖ చిత్రం తో జనవరి 2021 నెల వాహిని మహోన్నతంగా ఉన్నది... కలము, కాగితముల విలువ తెలియజేసిన తీరు బాగుంది... మీరన్నది నిజమే... నిన్న ఏమి జరిగిందో చెప్పలేని స్థితిలో ఉన్నాము... వ్రాయడం మంచి అలవాటు... దీని వలన మతిమరుపు దరి చేరదు...

మన తెలుగువారి పండుగల గురించి, ముగ్గుల గురించి విజయగారు బాగా చెప్పారు... భౌతికంగా కలిగే సుఖ దుఃఖాలను, శీతోష్ణస్థితులను, సమభావంతో, సహనంతో భరించాలి అంటూ భగవద్గీతపై శ్రీ పెయ్యేటి రంగారావుగారి వివరణ చాలా బాగుంది... దేహము గురించి, ఆత్మ గురించి బాగా వివరించారు... నశించిపోయే దేహము మీద మమకారం పెంచుకుని నీ కర్తవ్యం మరచిపోవద్దు అంటూ అర్జునుని కార్యోన్ముఖుని చేయటం అందరికీ అర్థం అయ్యేలా వివరించారు...

లలితగారు కనుమ గురించి ఇచ్చిన వివరణ బాగుంది... అనూరాధగారి ముగ్గుల ప్రాశస్త్యం, అందులోని గొప్పతనం గురించిన కథనం బాగుంది... పెయ్యేటి శ్రీదేవిగారి ముగ్గులు బాగున్నాయి... వృద్ధ బాలుడి అనుభవం ఆలోచనాత్మకంగా ఉంది...

గజల్ – వ్యక్తిత్వ వికాసంలో డా. కె టి పద్మజగారు సి నా రె గారి గజల్ లో కష్ట సుఖాలు సమానంగా స్వీకరించాలని చెప్పడం బాగుంది...

చాలా రోజులకు కూనలమ్మ పదాలు చదువుతుంటే చాలా బాగా అనిపించింది... శ్రీ పెయ్యేటి రంగారావుగారి ఏమీ కాలేని 'నేను' బాగుంది... 'అమెరికరోనా కకానికలం' కథ హాయిగా నవ్వుకుంటూ చదువుకున్నాము... ఏదో శక్తి మనల్ని రక్షిస్తోంది, కానీ ఆ శక్తి, మనల్ని రక్షించాల్సింది, రాజకీయ నాయకుల నుంచి... బాగా చెప్పారు చిట్టెన్ రాజుగారు... 'స్వయం ప్రకటిత విజేత' పద ప్రయోగం బాగుంది... స్వామీ వివేకానంద సూక్తులు ప్రతి ఒక్కరు ఆచరించవలసినవి ఎన్నుకుని అందించారు... చాలా సంతోషం...

'తనను తాను చిన్న బుచ్చుకోవడం' – అన్ని ఇతర బలహీనతలకంటే పెద్ద బలహీనత... 'తనను తాను ద్వేషించుకోవడం' మొదలు పెట్టిన వ్యక్తికి పతనం తప్పదు... ఇది నాకు చాలా బాగా నచ్చింది... మనిషి డిమోటివేట్ అయ్యేది ఇక్కడే...

శ్రీమతి డి కామేశ్వరిగారి 'మహిమ' ఆసక్తికరంగా సాగుతోంది... మనషికి మాత్రమే స్వంతమైన నవ్వు గురించి విశ్లేషణ బాగుంది... నవ్వును ఆపుకోగలము, కానీ బలవంతంగా నవ్వలేము... జీవితంలో ఆశ, విశ్వాసం అవసరం... హాస్యం ఆ రెంటినీ ఇస్తుంది... నిజమే కదా...

ఆద్యంతం ఆసక్తికరంగా తీర్చి దిద్దిన వాహిని సంతృప్తికరంగా ఉంది...

**శ్రీమతి షామీరు జానకీ దేవి, హైద్రాబాద్**

❖❖❖❖❖

# వంటిల్లే మన ఔషధాలయం

-శ్రీమతి అనురాధ నేదునూరి, హైద్రాబాద్

మంచి మంచి ఆరోగ్య చిట్కాలలో కొన్నిటి గురించి విశదీకరిస్తాను
మన వంటిల్లే మన ఔషదాలయం. మనం వాడుకునే దినుసులలో ఆరోగ్యాన్ని మెరుగు పరిచే గుణాలున్నాయి.

**జీలకఱ్ఱ (cumin seeds)**

జీలకఱ్ఱను మనకు వంటల్లో వాడడం మాత్రమే తెలుసు. ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోడానికి ఎలా వాడాలో తెలుసుకుందాం. ఎందుకంటే నేను ఒక ఆరేండ్లుగా వాడుతూ నా ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ అధిక బరువులోంచి విముక్తి పొందాను కీళ్ల నొప్పుల నుండి కూడా బయటపడ్డాను. అంతే కాకుండా బీపీ, షుగర్ ను కూడా నియంత్రించుకున్నాను. అందుకే మీకు అంద జేయాలనుకున్నాను.
రోజు ఒక స్పూన్ జీలకఱ్ఱను ఒక గ్లాసు నీటిలో నానబెట్టి ఉదయం మరిగించి చిటికెడు నల్ల ఉప్పు లేదా రాళ్ళ ఉప్పును కలిపి కొద్దిగా నిమ్మరసం పిండి గోరు వెచ్చగా తాగినట్లైతే అధిక బరువును నియంత్రిస్తుంది, గాస్ ప్రాబ్లెమ్ తగ్గిస్తుంది,జీర్ణ క్రియను చక్కబరుస్తుంది. కడుపుబ్బరం తగ్గిస్తుంది. కిడ్నీ లో రాళ్లను కరిగిస్తుంది,బిపి, షుగర్లనూ నియంత్రిస్తుంది. కడుపులోని నులి పురుగుల్ని బయటికి పంపుతుంది, మల బద్ధ కాన్ని అరికడుతుంది,అరిశమొలల్ని తగ్గిస్తుంది. రోజు కొద్దిగా పచ్చి జీలకర్ర పొడిని మజ్జిగ లో కలిపి తాగితే త్రేన్పులు తగ్గుతాయి.

**మిరియాలు (pepper)**

నల్లమిరియాలు, తెల్లమిరియాలు మాత్రమే మనకు తెలుసు. బయటి దేశాల్లో ఆకుపచ్చ మిరియాలు, పింక్ మిరియాలు కూడా  ఉన్నాయి. అమెరికా లో అధికంగా వాడతారు. ఎందుకంటే వీటిలో ఉష్ణాన్ని శీతలం చేసే గుణం ,శీతలాన్ని ఉష్ణ పరిచే గుణము ఉంది. సుగంధ ద్రవ్యాలలో మిరియాలు ఒకటి. మిరియాలు "క్వీన్ ఆఫ్ స్పైసెస్' అని చెప్పవచ్చు.
అందరికీ ఒక అపోహ ఉంది మిరియాలు వేడి అని. కానీ మిరియాలు మన శరీరాన్ని అధిక వేడిని తగ్గిస్తాయి మిరియాల పొడి సేవించడం వల్ల మన ఒంటిలోని వేడిని బయటకు పంపిస్తుంది. వీటిని ఆహారంలో రుచి పెంచడానికి ఉపయోగిస్తారు
మిరియాల పొడిని పాత బెల్లం తో కలిపి తీసుకుంటే జలుబు, దగ్గు, అధిక కఫం తగ్గుతాయి మిరియాలకు.

**మెంతులు (fenu greek)**

రోజు ఒక స్పూన్ మెంతులు రాత్రి నీటిలో నానబెట్టి ఉదయాన్నే పరగడుపున ఆ నీటిని తాగి నానిన మెంతులు తినడం వల్ల అధిక బరువు తగ్గుతుంది. చెడు కొవ్వునుతగ్గిస్తుంది. బీపీ ,షుగర్,నియంత్రణ లో ఉంటాయి. శరీరం లో ఇన్సులిన్ లెవెల్స్ వృద్ధి చెందుతుంది.
మెంతుల్లో  పిండి పదార్థము,తేమ,మంచికొవ్వు,పీచు పదార్థము,కాల్షియం,పాస్పరస్,కేరోటిన్,నియసిన్, B1,B2 అధికంగా ఉంటాయి.
ఆధిక పొట్టతో బాధ పడే వారు మెంతులు రోజు తీసుకోవడం వల్ల బెల్లీ తగ్గుతుంది. మెంతులు రోజు తీసుకోవడం వల్ల పెద్ద ప్రేగు శుభ్రమై కాలన్ కాన్సర్ రాదు.

గర్భం తో ఉన్న మహిళలు మెంతులు తీసుకోవడం వల్ల ప్రసవ సమయంలో ఉపయోగకరంగా వుండి సుఖప్రసవం జరుగుతుంది.ఋతుక్రమ సమయం లో వచ్చే నొప్పితగ్గుతుంది. ఋతుక్రమాన్ని నియంత్రిస్తుంది.

**బెల్లం(jaggery)**

బెల్లం ఆరోగ్యానికి చాలా మంచిది.

ప్రతి ఒక్కరు ఇంట్లో షుగర్ కి బదులు బెల్లం వాడితే ఇంటిలోని వారు అందరు ఆరోగ్యంగా వుంటారు.

బెల్లం లో చాలా రకాలు ఉంటాయి.

చెరుకు బెల్లం, తాటి బెల్లం, ఖర్జూర బెల్లం, ఈత బెల్లం

100 గ్రాముల బెల్లం లో353 కార్బోహైడ్రేట్లు, 95 mg కాల్షియం, 40 mg పాస్పరస్, 2.6g ఐరన్ ఉంటాయి.

రోజు బెల్లం తినే వారిలో రక్త శుద్ధి జరుగుతుంది.

బెల్లం రోజు తీసుకోవడం వల్ల లివర్ శుద్ధి చెంది దాని పనితీరు మెరుగు పరుస్తుంది,

బెల్లం రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది

బెల్లం లో ఐరన్, ఫోలిక్ ఆసీడ్ అధికంగా వుండడం వల్ల రక్త హీనతను తగ్గించి హిమోగ్లోబిన్ ను పెంపొందిస్తుంది,

కీళ్ల నొప్పులను తగ్గిస్తుంది

ఫ్యాక్టరీలో పని చేసేవారికి బొగ్గు బావుల్లో పని చేసే వారికి రోజు బెల్లం ఇస్తారు వారు పీల్చే దుమ్ము దూళిని నియంత్రించేందుకు.



❖❖❖❖❖

# మీరా కృష్ణ భక్తి

-శ్రీమతి ప్రసూన రవీంద్రన్, హైద్రాబాద్



❖❖❖❖❖




❖❖❖❖❖


SRI LAKSHMI SUPERMARKET
SLS
WEEKEND DEALS
Friday
Saturday &
Sunday Only
FRUIT & VEG
SPICES & LENTILS
FROZEN FOODS
UTENSILS
SNACK
FLAVOURS
RICE
Visit our store for
Weekly specials
WIDE RANGE OF GROCERIES,
INDIAN, SRILANKAN, NEPALESE,
PAKISTAN & BANGLADESH
86 Station Street,
Wentworthville NSW 2145

-శ్రీమతి డి. కామేశ్వరి, హైద్రాబాద్



"నువ్వేమంటున్నావు ? మా ఆయన రాసలీలలేమిటి ?" తెల్లబోతూ అడిగింది సుస్మిత.

"అంటే నీకసలు ఏడాదిగా జరుగుతున్న భాగోతం గురించి ఏమీ తెలియదా"?

సుస్మిత మరింత తెల్లబోతూ కలవరంగా చూసింది. తెలియదన్నట్టు తల అడ్డంగా ఊపింది, పాలిపోయిన మొహంతో.

"మీ ఆయన ప్రీతి అన్న అమ్మాయితో లివిన్ రిలేషన్‌షిప్ చేస్తున్నాడు. ఒక మంచి అపార్ట్‌మెంట్ కొనిచ్చాడట. కారు, డబ్బు, వేషాలు, యాడ్ వరల్డ్‌లో బోలెడు అవకాశాలు అన్నీ ఇచ్చి తనతో రెండో సెటప్ పెట్టాడు. నువ్వు ఇంత అమాయకంగా ఎలా ఉన్నావు సుస్మిత ? ఇంట్లో మగాడిలో మార్పు కూడా కనిపెట్టలేకపోయావా? ఇంత జరుగుతుంటే ఈ వార్త నీదాకా రాలేదా" ?

సుస్మిత వెర్రిమొహం పెట్టింది. తెల్లబడిన మొహం నల్లబడింది. "నిజంగానా ? నువ్వు చెప్పేది నిజమేనా" ? అంది పళ్ల బిగువున.

"బాగుంది, నీతో ఇలాంటి విషయాల్లో అబద్ధం ఎందుకు చెపుతాను" ?

"నీకెలా తెలిసింది ? ఎవరు చెప్పారు నీకు" ? ఆరా తీసింది.

"నాకు మొన్న తెలిసింది. మా ఆడపడుచు కూతురు ఆ అపార్ట్‌మెంట్స్‌లోనే ఉంటుంది. ప్రీతి చాలామందికి తెలుసు. ప్రకటనల్లో, పత్రికలలో, యాడ్స్‌లో, టీ.వి. యాడ్స్‌లో చూస్తారు కదా అందరూ. ఆ అమ్మాయిని అందరూ చూసేవారు. కొంతమంది ఆ అమ్మాయితో కాస్త పరిచయం పెంచుకున్నారు. ఏ లిఫ్ట్‌లోనో, వచ్చేటప్పుడో, పోయేటప్పుడో 'హాయ్' అన్న పలకరింపు. ఓ చిరునవ్వు తప్ప ఎక్కువగా ఎవరితోనూ మాట్లాడకపోయినా, అదే భాగ్యంగా అనుకునేవారు అక్కడ ఉండేవారు. ఆ అమ్మాయింటికి వినోద్ వచ్చి పోవడం చాలామందే చూసినా, పెద్ద కారులో వచ్చే వినోద్‌ని అడిగేవారెవరు. యాడ్ వరల్డ్, ఫ్యాషన్ వరల్డ్‌లో బాయ్‌ఫ్రెండ్సు, లవర్స్ కామన్. అది అందరికీ తెలిసిందే. అందుకే చూసీ చూనట్లుండేవారు".

"మరి ..." ఆరాటంగా అడిగింది.

"ఇన్నాళ్లు మా ఆడపడుచు కూతురు సుజాత కూడా అదే అనుకుందిట. పదిహేను రోజుల కిందట మా ఇంట్లో మేరేజ్ ఏనివర్సరి పార్టీ ఇచ్చినప్పుడు నువ్వు, వినోద్ వచ్చారు గదా. ఆ పార్టీకి సుజాత, వాళ్లాయన కూడా వచ్చారు. అక్కడ వినోద్‌ని చూసి ఆశ్చర్యంగా అతనెవరు ? అంటూ ఆరా తీసింది. ఊరికే అడిగిందేమో అనుకుని వినోద్ గురించి, మీ కంపెనీ గురించి, నువ్వు అతని భార్యవని అన్ని విషయాలు మర్నాడు మాట్లాడుకున్నాం. సుజాత అప్పుడు వినోద్ గురించి, ప్రీతి గురించి చెప్పింది విని ఆశ్చర్యపోయాను. నమ్మలేకపోయా. వెంటనే నీకు చెప్పకుండా సుజాతని అన్ని విషయాలు నాలుగైదు రోజులు కనిపెట్టి చెప్పమన్నాను. వాచ్‌మేన్ ద్వారా పక్కనుండే అపార్ట్‌మెంట్ వారి ద్వారా అతని రాకపోకలు, వివరాలు పూర్తిగా చెప్పమన్నాను. అతను సాధారణంగా సాయంత్రం వచ్చి రాత్రి పది గంటల వరకు ఉంటాడు. ఒక్కోసారి సూట్‌కేసుతో వచ్చి రెండు మూడు రోజులుండేవాడు. కనీసం రోజుకొక సారన్నా ఏదో ఒక టైములో వస్తాడు. ఇద్దరూ కలిసి బయటికి మాత్రం వెళ్లేవారు కాదు అని చెప్పింది సుజాత. నీకు చెప్పేముందు అన్నీ రూఢీగా తెలుసుకునే చెప్తున్నాను" అంది స్నేహితురాలు కాంచన.

ఇద్దరిదీ ఎక్కడో దూరపు చుట్టరికం. పైగా చిన్నప్పటి నుంచీ ఇద్దరూ కలిసి చదువుకున్న స్నేహం. దాంతో ఆమె చెప్పింది విని, సుస్మిత నిర్ఘాంత పోయింది. ఆగ్రహం పట్టలేక, ఆవేశంగా పార్టీ నుంచి బయటికి వచ్చింది. తరువాత కారులో కూర్చుని, ఆవేశం తగ్గించుకుని తెలివిగా ఆలోచించింది. తాను తొందరపడి, ఆవేశపడి భర్తను నిలదీస్తే ... ? అతనిప్పుడు తన బెదిరింపులకు లొంగడు. కంపెనీ లాభాల బాట పట్టింది. అవును, నేను ప్రేమిస్తున్నాను అని తెగేసి చెపితే ... తనేం చెయ్యాలి ? అసలే ఇద్దరి మధ్య సంబంధం అంతంత మాత్రం. ఇంట్లో తను పేరుకు మాత్రమే భార్య. తన

గురించి అస్సలు పట్టించుకోడు. ఎక్కడికెళ్ళినా, ఏం చేసినా, ఎంత ఖర్చుపెట్టినా ... ఏదీ కల్పించుకోడు. కొడుకుతో మాత్రం, వాడు స్కూలుకెళ్ళేముందు ఓ అరగంట కబుర్లు చెబుతాడు. చదువు, ఆటల గురించి, స్నేహితుల గురించి మాట్లాడతాడు. ఎప్పుడైనా సెలవురోజు అలా కారులో కాసేపు తిప్పి వాడికేం కావాలో కొనిపెడతాడు. భార్యాభర్తల మధ్య ఉండాల్సిన అనుబంధం, ఆప్యాయత, దగ్గరితనం ఏనాడో పోయాయి. ఒక ఇంట్లో ఉన్నారన్నదే తమ బాంధవ్యం. ఇలాంటి స్థితిలో రెచ్చగొడితే, ఇంట్లో దొరకని ఆనందాన్ని బయట అనుభవిస్తున్నప్పుడు ఏదో తెగింపే ఉంటుంది అతనిలో. ఇంటికి చేరగానే బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపులు మూసుకొని తండ్రికి ఫోన్ చేసి విషయం అంతా చెపుతూ, తనకి జరిగిన అవమానం తట్టుకోలేక ఏడుపు ఆరంభించింది. అటునించి ఆయన అంతా విన్నాడు. కూతురిలా ఆవేశ పడలేదు. అతను పక్కా బిజినెస్‌మాన్. బంగారం వ్యాపారంలో ఆరితేరి, ఏది ఎలా సాధించాలో పట్టువిడుపులు తెలిసిన మనిషి. ఆవేశపడి, కోప్పడి గుట్టు రట్టు చేసుకోకుండా, విషయాన్ని మట్టుపెట్టగలిగిన సమర్థత ఉంది కిషన్‌లాల్ అగర్వాల్‌కి. కూతుర్ని ఓదార్చాడు. "అంతా సరిచేస్తాను. నువ్వేం బాధపడకు. అతని దగ్గర ఏం తెలీనట్టే ఉండు'' అని ధైర్యం చెప్పి, ఆ అపార్ట్‌మెంటు పేరు, ప్రీతి వివరాలు తెలుసుకుని, కార్యాచరణలోకి దిగాడు. ఒక్క రెండు రోజుల్లోనే ప్రీతి ఎవరు, వినోద్ కంపెనీలో ఎప్పుడు చేరింది మొదలు ... వినోద్, ప్రీతిల మధ్య అనుబంధం ఎప్పుడు మొదలైంది, ఈ అపార్ట్‌మెంట్ ఎప్పుడు మారింది, వినోద్ రాకపోకల సమయాలు, వారిద్దరి మధ్య సంబంధ బాంధవ్యాలు, ప్రీతికి ఏఏ ఇతర కంపెనీలలో ఆఫర్లున్నాయి. ఆమె సంపాదన ఎంత, ఈ మధ్య వారిమధ్య మనస్పర్థలు మొదలవడం, ఆఖరికి ప్రీతి నర్సింగ్‌హోంకి వెళ్ళి ప్రెగ్నెన్సీ టెస్ట్ చేయించుకోవడం, వినోద్ గొడవపడడం వరకు ప్రతీ చిన్న విషయం అపాయింట్ చేసిన డిటెక్టివ్ ఏజెన్సీ రాబట్టి రిపోర్ట్ అందచేసింది. ఆమె కారు డ్రైవరు, ఇంట్లో ఉండి పనిచేసే అమ్మాయి, ఇరుగుపొరుగు వారు, వాచ్‌మేన్, ఆఖరికి

ప్రీతి వెళ్లిన నర్సింగ్‌హోం నుంచి కూడా వివరాలు రాబట్టారు. ఈ రిపోర్టు మొత్తం చదివిన కిషన్‌లాల్... తనూహించిన దానికంటే విషయం చాలా దూరమే వెళ్లిందని, ప్రీతి ప్రెగ్నెంట్ అన్నది విని ఆయన మరింత సీరియస్ అయ్యాడు.

వినోద్, ప్రీతిల సంబంధం గురించి విన్న సుస్మిత గత రెండు మూడు రోజులుగా భర్తను అన్ని కోణాల నుంచి గమనించి చూస్తూ, అతి కష్టం మీద కోపం, ఆవేశం నిగ్రహించుకుంటోంది. తండ్రిమీద ఆమెకెంతో నమ్మకం, భరోసా. ఆయనకి తన మీద ఉన్న ప్రేమ తెలుసు. తనకెవరన్నా కష్టం కలిగించే మాట అన్నా, ఆఖరికి తల్లి అన్నా కూడా ఆయన సహించేవాడు కాదు. అలాంటిది అల్లుడు కూతురు కింత ద్రోహం చేస్తే ఊరుకోడని, ఈ సమస్యని ఎలా పరిష్కరించాలో ఆయనకి తెలుసని, తండ్రి అన్నీ సేకరించి చెప్పేవరకు ఆయన ఏం చేస్తాడో చూశాక, అప్పుడు బయటపడాలని ఓపిక పట్టింది. గత ఏడాది నుంచి వినోద్ ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది. ఇంట్లో అసలు తనను పట్టించుకోడు. ఏమన్నా వినీ విననట్టు వెళ్లిపోవడం, ఇంట్లో ఉండే సమయం తగ్గిపోవడం, నెలకి రెండు మూడుసార్లు ముంబయి, ఢిల్లీ ఆఫీసు పనులంటూ రెండు మూడు రోజులు వెళ్లిపోవడం ... అన్నీ చూసిన ఆమెకి వినోద్ మీద అనుమానం రాలేదు. తమిద్దరి మధ్య ఎప్పుడూ పెద్ద సఖ్యత లేదు. సాన్నిహిత్యం లేదు. పని ఒత్తిడిలో అలా అంటీ ముట్టనట్టు హడావిడిగా వెళుతున్నాడు వస్తున్నాడనుకుంది తప్ప వినోద్ ఇలా ఇంకో ఆడదానితో సంబంధం పెట్టుకుంటాడన్న అనుమానం కూడా తలెత్తలేదు. అలాంటిది తన వెనక ఇంత పకడ్బందీగా, హాయిగా ఇంకో ఇంట్లో రెండో సెటప్ పెట్టాడంటే, ఇప్పటికీ ఆమెకి నమ్మశక్యం కావడం లేదు. వినోద్ చేతకానివాడని, తనంటే భయమని, తన డబ్బుతోనే ఈ బిజినెస్ నిలబడింది కాబట్టి తనకు వ్యతిరేకంగా ఏ పనీ చేసే సాహసం చెయ్యడని నమ్మకం. ఈరోజు ఆ నమ్మకం సడలిపోయింది. కట్టుకున్న భార్యకు ఇంత ద్రోహం చేయగలిగిన భర్తని ఏం చెయ్యాలి, ఎలా బుద్ధి చెప్పి మళ్లీ గుప్పిట్లో పెట్టుకోవాలని ఆమె లోలోపల ఉడికిపోతూ అతి కష్టం మీద నిగ్రహం చూపించింది.

ఇంటికి పిలిచి తండ్రి సేకరించిన వివరాలు చెప్పగానే నిర్ఘాంతపోయింది. అన్నింటికంటే ప్రీతి గర్భవతి అన్న నిజం ఆమె తట్టుకోలేకపోయింది. ఆగ్రహావేశాలతో లేచి నిలబడ్డ కూతుర్ని చేయిపట్టుకు లాగి కూర్చోపెట్టాడు తండ్రి. "ఇది ఆవేశంతో చెయ్యాల్సిన పని కాదు. నువ్వు కామ్‌గా ఉండు. నేను అన్నీ దారిలో పెడతా" భరోసా ఇచ్చాడు కిషన్‌లాల్.

"ఊరుకోను డాడీ ! ఆ వినోద్‌ని ఇంట్లో నలుగురిముందు నిలబెట్టి కడిగేసి మళ్లీ తలెత్తకుండా చేస్తాను. అసలేమనుకుంటున్నాడు నా గురించి" ఎగిరిపడింది.

కూతుర్ని సముదాయించి "ముందు అటు నుంచి నరుక్కురావాలి. అల్లుడిని కాదు కంట్రోల్‌లో పెట్టాల్సింది. ఆ అమ్మాయిని అల్లుడి జీవితంలోంచి తప్పించాలి. అదంతా నాకు వదిలేయ్. ఇంకో రెండు రోజులు టైమివ్వు నాకు" అని నచ్చచెప్పి పంపాడు.

✻ ✻ ✻

ఇంట్లోకి చొరపడ్డ జెమజెట్టీల్లాంటి ముగ్గురు మనుష్యులని, ఆ తరువాత సినిమాలో మాదిరి హుందాగా లోపలికి అడుగుపెట్టిన కిషన్‌లాల్‌ని చూసి ... తలుపుతీసిన ప్రీతి బిత్తరపోయింది. "ఏయ్ ... ఎవరు మీరు ? ఏమిటి ఈ దౌర్జన్యం ?" అరిచింది.

కిషన్‌లాల్ అక్కడున్న సోఫాలో కూర్చొని చుట్టూ పరిశీలిస్తూ, "ఊఁ బాగానే ఉంది ప్రేమకుటీరం. సెటప్ బాగానే ఉంది" అన్నాడు వ్యంగ్యంగా.

"ఏయ్, ఎవరు నువ్వు ?" అరిచింది ప్రీతి.

"చెపుతా, ఇలా వచ్చి కూర్చో. ఆ తలుపులు మూసిరా నలుగురూ వింటే బాగుండదు" అన్నాడు.

ప్రీతి భయంగా చూసింది. వచ్చినవారిలో ఒకడు తలుపు మూసి గడియ

పెట్టి, గుమ్మం దగ్గరే నిలబడ్డాడు. తక్కిన ఇద్దరూ కిషన్‌లాల్ వెనక వచ్చి నిలబడ్డారు. ప్రీతి భయంతో "ఏమిటిదంతా ? ఎవరు మీరు" ? మళ్లీ అడిగింది.

"నేనెవరో నీకు అనవసరం. ఎందుకొచ్చానో చెపుతాను విను. నీకు మూడు రోజులు టైమిస్తున్నాను. నీ పెట్టెలు, బట్టలు మాత్రం పట్టుకుని ఇల్లు వదిలి వెళ్లు. ఈ ఇల్లు నాది అనకు. ఇది నీదికాదు. ఇందులోని ఏ ఒక్క సామానూ నీది కాదు. ఎక్కడికి వెడతావో నాకనవసరం. వెళ్లకపోతే సామాను మిగలదు. నువ్వూ మిగలవు. చెప్పినట్టు చేస్తే నువ్వు మాత్రం మిగులుతావు. బతికుంటే సామాను మళ్లీ వస్తుంది. ఇక్కడినుంచి వెళ్లాక నీ బతుకు నీది".

"ఏమిటి మీ దౌర్జన్యం ? మీరెవరు నన్ను వెళ్లమనడానికి ? ఇది నా ఇల్లు. ఏడాది నుంచి ఉంటున్నానిక్కడ. నేనెందుకు వెళ్లాలో చెప్పండి ముందు. రౌడీయిజం చేస్తే పోలీసుల్ని పిలుస్తా జాగ్రత్త" సెల్ తీయబోయింది. కిషన్‌లాల్ వెనుక నిలబడ్డ ఇద్దరిలో ఒకడు ముందుకురికి, టక్‌మని చేతిలోంచి ఫోన్ లాక్కున్నాడు.

"చూడు ... ఇలాంటివాటికి మేం బెదరం. నీకు బతుకు మీద ఆశ ఉంటే మేం చెప్పినట్టు విను. వినను అంటే రెండురోజులు టైమ్ కూడా లేదు".

ఈసారి నిజంగానే భయమేసింది ప్రీతికి.

"ఏం కావాలి మీకు ? ఎందుకిలా నా మీద దౌర్జన్యం ... ?"

"వినోద్ జీవితం నుంచి తప్పుకో. అతనితో ఏ విధమైన సంబంధ బాంధవ్యాలు ఉండరాదు. ఈ ఇల్లు వదిలి, వీలయితే ఊరు వదిలిపో. దానికి ఎంత డబ్బు ఇవ్వాలో మేం నిర్ణయించి ఇస్తాం. గప్‌చుప్‌గా పుచ్చుకుని వెళ్ళు. కాదని మొండికేస్తే జరిగే దానికి మేం బాధ్యులం కాము".

"మీరు వినోద్ మనుష్యులా ? వినోద్ పంపించాడా బెదిరించడానికి" ? నమ్మలేనట్లు అడిగింది. ఇంత నీచానికి దిగజారాడా వినోద్ ! వాడుకున్నన్ని రోజులు వాడుకుని, తల్లిని కాబోతున్నానని తెలిసి, తప్పించుకోవడానికి ఇంత నీచంగా ...

"ఏయ్ ఆపు. వాగుడనవసరం. మేమే వచ్చామో, వినోద్ పంపాడో నీ ప్రశ్నలకి జవాబులు చెప్పం ... చెప్పింది చేయి ..." కఠినంగా అన్నాడు కిషన్‌లాల్. అంటూనే తన మనుష్యులకి సైగ చేశాడు. ఇంట్లోకి వెళ్ళి అన్ని గదులూ వెతికి వినోద్, ప్రీతి ఉన్న ఫోటోలు తీసుకున్నారు. "రెండు రోజులు టైము, ఇల్లు విడిచి వెళ్లడానికి ..." అంటూ అందరూ బయటికి వెళ్ళిపోయారు.

నిశ్చేష్టురాలై అలా ఉండిపోయి, తర్వాత ఫోన్ తీసింది. అటునుంచి స్విచ్ఛాఫ్ అని వచ్చింది. అలా ఓ గంట ఆలోచిస్తూ కూర్చుండిపోయింది ప్రీతి.

✳ ✳ ✳

ఆఫీసు నుంచి ఇంటికి వచ్చి డిన్నర్‌కి కూర్చునే ముందు ఇంట్లోని నలుగురూ కూర్చుని కబుర్లాడుకునే వేళ, తుఫానులా ఇంట్లోకి దూసుకు వచ్చింది ప్రీతి.

"వినోద్" లోపలికి వస్తూనే అరుస్తూ, వినోద్‌ని చూసి చకచక అతని దగ్గరికి వెళ్ళింది. "నువ్వు ఇంత నీచానికి ఒడిగడతావా ? ఛ ... నువ్వింత నీచుడవని తెలియక మోసపోయాను. వాడుకున్నన్ని రోజులు వాడుకుని నేను ప్రెగ్నెంట్ అని చెప్పగానే, నన్ను వదుల్చుకోడానికి ఇంటికి రౌడీలని పంపించి బెదిరిస్తావా ? నన్ను ఇంట్లోంచి దౌర్జన్యంగా వెళ్లగొట్టడానికి ప్రయత్నిస్తావా ? ఏడాదిపాటు నాతో ప్రేమాయణం జరిపి, నువ్వే నా ప్రాణం అని రోజా నా ఇంటికి వచ్చి, ప్రేమ కురిపించి, నీ రాకపోకలకి వీలుగా ఇల్లు కొనిచ్చి, ఇప్పుడు నేను గర్భవతినని తెలిసి నీ పరువుకోసం అబార్షన్ చేయించుకోమంటే చేయించుకోనన్నానని, ఇంత నీచానికి దిగజారావా ? ఆ ప్రేమ కబుర్లు అంతా మోసమేనా ? నిన్ను నమ్మి నా సర్వస్వం అర్పించాను. ఆ మాత్రం దయకూడా లేకుండా కట్టుబట్టలతో నన్ను గెంటించా లనుకున్నావా ? ఇంత నిర్దయగా ఓ ఆడపిల్ల జీవితంతో ఆడలాడతావా ? నువ్వసలు మనిషివేనా ? నీలో ఇంత రాక్షసత్వమా ? భార్యతో సుఖం లేక నా దగ్గరికి వచ్చానని, ప్రేమకోసం

అల్లాడుతున్నానని నా వెంటపడ్డావు. నీ మాటలు నమ్మి, మంచివాడివని నిన్ను నమ్ముకుని ఏడాదిగా నీతో కలిసి బతికినందుకు ఇదా ఆఖరికి నువ్వు నాకిచ్చింది" ? అతన్ని గుంజుతూ ఆవేశంగా అరిచింది.

పది నిమిషాలు ఆగకుండా ఆవేశంతో అరుస్తూ, అందరూ తేరుకునేలోగా తను అనవలసిన మాటలన్నీ ... కథంతా మొత్తం అందరికీ అర్థం అయ్యేట్టు చెప్పేసి వగరుస్తూ, రుద్రకాళి అవతారం ఎత్తిన ప్రీతిని నిశ్చేష్టులై చూస్తుండి పోయారు. అందరి కంటే ముందుగా తేరుకున్నది అవినాష్ జైన్. "ఏయ్, ఎవరు నువ్వు ? ఏమిటి నువ్వు మాట్లాడుతున్నది ? నీకెంత ధైర్యం ఇలా ఇంట్లో జొరపడి అల్లరి చేస్తున్నావు. రౌడీలని పంపడం ఏమిటి ? మేమెవర్నీ పంపలేదు. ఏమిటీ దౌర్జన్యం" కోపంగా అరిచాడాయన.

"నేనెవర్నో మీ కొడుకు నడగండి సార్" నల్లబడిన మొహంతో మాటలు రాక, ఏం చెయ్యాలో తెలియక నిశ్చేష్టుడిలా నిలబడిన వినోద్‌ని చూపిస్తూ అంది. "అడగండి ... నే చెప్పిన మాటల్లో ఒక్క అబద్ధం ఉందేమో, నా ఎదురుగా, ఇక్కడే అడగండి" అరిచింది.

"ఇదిగో ముందు నువ్విక్కడనుంచి తక్షణం వెళ్ళు. నీకెంత ధైర్యం ఇలా ఇంట్లోకి వచ్చి పరువు తీయడానికి. మా దయాధర్మం మీద బతికే నువ్వు మమ్మల్ని ఎదిరించి నిలదీసి మాట్లాడుతున్నావు. అసలు నిన్నెవరు లోపలికి రానిచ్చారు. ఏయ్, వాచ్‌మేన్ ..."

"కొడుకు గూండాలతో బెదిరించాడు. తండ్రి పెద్దమనిషిగా ఆడపిల్లకి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాల్సిందిపోయి వాచ్‌మేన్‌తో గెంటిస్తాడు. అవును సార్ ! డబ్బున్నవాళ్ళు ఏమైనా చేస్తారు. నాకు న్యాయం జరిగేవరకు ఇక్కడినుంచి కదలను. పోలీసుల్ని పిలుస్తారా ... పిలవండి. అన్ని టీ.వి.ల వారినీ నేనూ పిలుస్తాను. మీ పరువుని బజారుకీడుస్తాను. ఆడపిల్ల కదా, ఏం చెయ్యలేదను కుంటున్నారేమో ..."

"చూడమ్మాయ్ ... నీ పేరు కూడా నాకు తెలియదు. నా కొడుకు తప్పు చేస్తే నువ్వు అడిగే పద్ధతి ఇదికాదు. పెద్దవాడిగా నేను న్యాయం చెయ్యాల్సి ఉంటే, ఇలా ఇంటిమీదకు వచ్చి దౌర్జన్యంగా ప్రవర్తించడం వల్ల, నీ మీద సానుభూతి కలగకపోగా న్యాయం చెయ్యాలన్న ఆలోచన కూడా పోతుంది. చూడు, నీ ఇష్టం లేకుండా నా కొడుకు నిన్ను బలవంతపెట్టాడా ? నీ అవసరం కోసం, నీ ప్రయోజనం కోసం, డబ్బుకోసం, నువ్వు వాడి జత కోరి ఇష్టపడ్డావు. నువ్వు ముందే ఏమన్నా షరతులు పెట్టావా ? నిన్ను పెళ్ళి చేసుకుంటానని చెప్పాడా ? మీ ఇద్దరూ ఏమనుకుని ఒకటయ్యారో మాకెవరికీ చెప్పి చేయలేదు. ఇవాళ ఇలా వచ్చి నిలేస్తే నేను నీకు సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం లేదు. మేం ఏ గూండాలనీ నీ ఇంటి మీదకి పంపలేదని మాత్రం చెప్పగలను. నేను నా కొడుకుతో మాట్లాడి అసలు సంగతేమిటో తెలుసుకుంటాను. నువ్వు చెప్పిందంతా నిజమైతే, నీ గురించి ఏం చెయ్యాలో, నీ పట్ల ఏ నిర్ణయం తీసుకోవాలో నిర్ణయించి చెపుతా. క్షణాల్లో నిర్ణయం తీసుకోవడానికి ఇదేమీ మామూలు విషయం కాదు. నిలబెట్టి అరిస్తే పని జరగదు. ముందు నువ్వు ఇక్కడినుంచి వెళ్ళు" ఆయన చాలా నిబ్బరంగా, దృఢంగా అన్నాడు.

ఆ క్షణంలో ఆ అమ్మాయిని శాంతపరిచి పంపకపోతే జరిగే అనర్థం ఆయనకి తెలుసు. ఆవేశంలో ఆమె నిజంగానే ప్రెస్‌వాళ్లని పిలిచి రభస చెయ్యొచ్చు. అప్పుడు తమ పరువు బజారున పడుతుంది. ఆ క్షణంలో ఆమెని ఎలా టాకిల్ చెయ్యాలో అనుభవజ్ఞుడైన బిజినెస్‌మేన్‌గా, ఓ తండ్రిగా ప్రయత్నం చేశాడు.

"ఏం చేస్తారు మీరు ? నా కొడుకుని వదిలెయ్, ఆ డబ్బు తీసుకుని పో అంటారు, అంతేనా ?" ప్రీతి ఎగిసిపడుతున్న గుండెలతో అంది.

"ఇప్పటికిప్పుడు ఇలా నిల్చుని చెప్పలేను. రేపటి వరకు ఓపిక పట్టు. నేనే వచ్చి మాట్లాడతాను" శాంతంగానే అన్నాడు ఆయన. వినోద్ మొహంలో నెత్తురు చుక్కలేదు.

**(సశేషం)**

❖❖❖❖❖

# ఘనమైన నీతి భవనాలు

-శ్రీమతి ఉషాశ్రీదేవి శ్రీధర,సిడ్నీ



ఈ చిన్నారి పసిపాపలు

మన భారతావనికి కనుపాపలు!!

వీరి కట్టడాలు, ఆశాసౌధాలు

మంచు బొమ్మలు మాత్రమే కావని.....

వాటిని జగదోద్ధారకమైన, నిజాయితీ కల సుందర సత్యమైన జగత్తుకు

ఘనమైన నీతి భవనాలు, ఘన కీర్తి మందిరాలు

చేసే ప్రయత్నాలలో మనందరమూ ఈ చిన్నారి శిశువులకు

చేయూతనిచ్చి కాపాడే బాధ్యత నిత్యమైనది ....మన అందరిదీ!

❖❖❖❖❖





# Kameswari



Computed according to Druk Siddhantham with Chitra Paksha Ayanamsa. Tidhi and Nakshtra are finishing times and Varjyam is start and finish times - Standard or Daylight Savings Time (AEST/AEDT) as applicable in Australia.

## ఫిబ్రవరి 2021

**శార్వరి పుష్య బ తదియ నుండి మాఘ బ పాడ్యమి**

శు – శుద్ధ; బ – బహుళ; వ – వర్జ్యం; పూ – పూర్వ; ఉ – ఉత్తర; రా - రాహు కాలం; పూర్తి అనగా తిధి/నక్షత్రం 00:00 నుండి మరుసటి రోజు 00:00 గంటల వరకు - 24 గంటల వ్యాప్తి. ఆస్ట్రేలియా లోని సిడ్నీ మెల్బోర్న్ కాల మానాలకు వర్తిస్తుంది.

**Panchanga Kartas: Neti Sivaramakrishna Sastry (Sydney) & Karra Bhaskara Sarma (Melbourne)**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| **ఆది**<br>R - 16:30 to 18:30 | సెలవు దినాలు<br>16– వసంత పంచమి<br>19– రథ సప్తమి<br>23– భీష్మ ఏకాదశి | **7**<br>బ దశమి 11:56<br>జ్యేష్ఠ 21:52<br>వర్జ్యం 4:17 వ 5:49 | **14**<br>శు విదియ 6:24<br>పూర్వాభాద్ర 22:2<br>వర్జ్యం 3:28 వ 5:9 | **21**<br>శు నవమి 21:8<br>రోహిణి 14:11<br>వర్జ్యం 5:17 వ 7:3<br>వర్జ్యం 20:20 వ 22: 5 | **28**<br>బ పాడ్యమి 16:41<br>పుబ్బ 15: 8<br>వర్జ్యం 0:14 వ 1:43<br>వర్జ్యం 21:43 వ 23:11 |
| **సోమ**<br>R - 7:30 to 9:30 | **1** పుష్యం<br>బ తదియ 1:47<br>బ చవితి 23:48<br>పుబ్బ 6:48<br>వర్జ్యం 13:35 వ 15:6 | **8**<br>బ ఏకాదశి 10:18<br>మూల 20:55<br>వర్జ్యం 19:23 వ 20:55 | **15**<br>శు తదియ 7:28<br>ఉత్తరాభాద్ర పూర్తి<br>వర్జ్యం 8:27 వ 10:11 | **22**<br>శు దశమి 22:42<br>మృగశిర 16:31<br>వర్జ్యం లేదు | సిడ్నీ<br>సూర్య ఉ అ<br>1 6:16 20:00<br>8 6:23 19:54<br>15 6:30 19:47<br>22 6:36 19:40<br>28 6:41 19:32 |
| **మంగళ**<br>R - 15:00 to 16:30 | **2**<br>బ పంచమి 21:44<br>ఉత్తర 5:25<br>వర్జ్యం 13:19 వ 14:49 | **9**<br>బ ద్వాదశి 8:47<br>పూర్వాషాఢ 20:16<br>వర్జ్యం 6:15 వ 7:49 | **16**<br>శు చవితి 9:4<br>ఉత్తరాభాద్ర 0:4<br>వర్జ్యం 13:17 వ 15:3 | **23**<br>శు ఏకాదశి 23:27<br>ఆరుద్ర 18:2<br>వర్జ్యం 1:27 వ 3:9 | మెల్బోర్న్<br>సూర్య ఉ అ<br>1 6:33 20:33<br>8 6:41 20:26<br>15 6:49 20:18<br>22 6:57 20:09<br>28 7:03 20:01 |
| **బుధ**<br>R - 12:00 to 13:30 | **3**<br>బ షష్ఠి 19:33<br>హస్త 3:59<br>వర్జ్యం 11:33 వ 13:3 | **10**<br>బ త్రయోదశి 7:35<br>ఉత్తరాషాఢ 19:45<br>వర్జ్యం 4:6 వ 5:39<br>వర్జ్యం 23:43 వ 1:19 | **17**<br>శు పంచమి 11:8<br>రేవతి 2:30<br>వర్జ్యం లేదు | **24**<br>శు ద్వాదశి 23:34<br>పునర్వసు 18:47<br>వర్జ్యం 6:24 వ 8:3 | |
| **లక్ష్మి**<br>R - 13:30 to 15:00 | **4**<br>బ సప్తమి 17:32<br>చిత్ర 2:40<br>వర్జ్యం 7:57 వ 9:27 | **11**<br>బ చతుర్దశి 6:33<br>శ్రవణం 19:34<br>వ 23:38 వర్జ్యం 1:15 | **18**<br>శు షష్ఠి 13:40<br>అశ్విని 5:18<br>వర్జ్యం 0:50 వ 2:37<br>వర్జ్యం 16:10 వ 17:59 | **25**<br>శు త్రయోదశి 22:43<br>పుష్యమి 18:52<br>వర్జ్యం 2:49 వ 4:25 | |
| **శుక్ర**<br>R - 10:30 to 12:00 | **5**<br>బ అష్టమి 15:34<br>స్వాతి 1:17<br>వర్జ్యం 6:35 వ 8:6 | **12●**<br>బ అమావాస్య 6:0<br>ధనిష్ఠ 19:57<br>వర్జ్యం లేదు | **19**<br>శు సప్తమి 16:19<br>భరణి 8:28<br>వర్జ్యం 21:58 వ 23:46 | **26**<br>శు చతుర్దశి 21:14<br>ఆశ్లేష 18:7<br>వర్జ్యం 7:16 వ 8:49 | |
| **శని**<br>R - 09:00 to 10:30 | **6**<br>బ నవమి 13:42<br>విశాఖ 0:0<br>అనురాధ 22:56<br>వర్జ్యం 3:49 వ 5:21 | **13** మాఘం<br>శు పాడ్యమి 5:52<br>శతభిషం 20:42<br>వర్జ్యం 3:22 వ 5: 1 | **20**<br>శు అష్టమి 18:53<br>కృత్తిక 11:28<br>వర్జ్యం లేదు | **27●**<br>శు పూర్ణిమ 19:12<br>మఖ 16:47<br>వర్జ్యం 5:27 వ 6:57 | |

japa kusuma samkasam kasyapeyam maha dyuthim |
thamorim sarva papaghnam pranathosmi divakaram ||

**పాట నేర్చుకుందామా/పాడుకుందామా**

**చిత్రం: శుభలేఖ**

**రచన: శ్రీ అన్నమాచార్య**

**సంగీతం: శ్రీ కె.వి. మహదేవన్**

నెయ్యములల్లో నేరేళ్ళో
వొయ్యన వూరెడి వువ్విళ్ళో

పలుచని చెమటల బాహుమూలముల-
చెలమలలోనా చెలువములే ll 2ll
థళథళమను ముత్యపు చెఱగు సురటి
దులిపేడి నీళ్ళాతుంపిళ్ళో
నెయ్యములల్లో నేరేళ్ళో
వొయ్యన వూరెడి వువ్విళ్ళో

తొటతొట కన్నుల తొరిగేటి నీళ్ళ
చిటిపొటి యలుకలు చిరునగవే ll2ll
వటఫలంబు నీ వన్నెల మోవికి
గుటుకలలోనా గుక్కిళ్ళో
నెయ్యములల్లో నేరేళ్ళో
వొయ్యన వూరెడి వువ్విళ్ళో

గరగరికల వేంకటపతి కౌగిట
పరిమళములలో బచ్చనలు(లే)ll2ll
మరునివింటి కమ్మనియంప విరుల-
గురితాకులినుపగుగ్గిళ్ళో
నెయ్యములల్లో నేరేళ్ళో
వొయ్యన వూరెడి వువ్విళ్ళో

https://www.youtube.com/watch?v=SyB3r8qNI2o

❖❖❖❖❖

**INDAUS Celebrating 15 years of excellence**

We Provide Services Related To:

- General Skilled Migration Visas
- Family Visas
- Employer Based - Skilled Visas
- Long Term Business Visas
- Visitor Visas
- Student Services and Visas
- MRT - Migration Review Tribunal

**INDAUS IMMIGRATION**

Home to all your migration needs...

**You enroll for professional year through us and we do 485 Visa for FREE**

**Good Scholarships & discounts for professional year program**

**Want to Know More Call Sree on 0416 799 306**

**What we do for Students**

**Student Visa Extensions**

**University & Course Change**

**Temporary Visas ( Post Study Work)**

***Sydney (Branch Office)***

Strathfield Plaza
Suite 7, Level 7, 11 The Boulevard
Strathfield NSW - 2135

***Melbourne (HQ)***


Suite 14, Level 11
401 Docklands Drive
Docklands VIC 3008

***Hyderabad, India***

Office
F.No. 303, Star G.B.R P.R.K. Enclave,
Dharam Karam Road, Ameerpet,
Hyderabad 500016 INDIA

Phone: +91 72070 44933

www.indausimmigration.com **Call 1300 699 306** info@indausimmigration.com


SMG Stone
SMG Stone pty ltd.
Web: http://www.smgstone.com.au
Phone : +61 2 9708 5566
Mobile : +61 418 696 672
Email: info@smgstone.com.au
STONE WITH LIFE
FOR STYLE AND ELEGANCE
FOR INDOORS AND OUTDOORS
Welcome to SMG Stone Pty Ltd . SMG Stone, based in Sydney, is committed to bring the nature to your homes from around the world. Established in 1992, SMG gained expertise in selecting, procuring and supplying natural stone from around the world. SMG has a huge selection of surfacing options for paving, building facades, lobbies, vanities, staircases and landscaping features. We are direct importers and wholesale distributors of quality natural stones such as granite, marble, slate, sandstones, cobble and the engineered stones in slab form for use in the manufacture of kitchen and vanity bench tops as well as other building uses.
Based in Sydney Australia with warehouses in Sydney and Melbourne, we are one of the reputed suppliers of an exclusive range of world class marble stone, granite and other natural stones. We import natural stone from around the world.
At SMG Stone Pty Ltd (SMG) we have the finest and largest product range. Our Sydney warehouse contain over 50,000sqm of natural stone. We have streamlined the supply chain for your convenience. We aim to achieve 100% client satisfaction by delivering a beautiful product with the highest quality and most importantly, with the right price. As project suppliers, we are able to procure natural stone according to your own specifications.
Specialized in the supply of natural stone products for hospitality, multi-family residential dwellings and institutional projects.
BRING NATURE TO HOMES
Designed by DSLRCREW


Apex
Dental Centre
Gentle, caring, quality dentistry
FREE Initial Consultation*
✓ General & preventative care
✓ Complete family care
✓ Cosmetic dentistry
✓ Gum disease and bad breath
✓ Crowns & Bridges
✓ Implants
✓ Full and partial dentures
* For non health fund members and no gap for health fund members.
We have Hindi, Telugu, Kannada, Marathi, Gujrati speaking dentists
FOUR CONVENIENT LOCATIONS
BAULKHAM HILLS
Suite 110, 10 Century Cct
Tel: 8850 4525
LIVERPOOL
Suite 4,61 Moore St
Tel: 9602 7815
QUAKERS HILL
206 Farnham Rd
Tel: 9626 5553
WENTWORTHVILLE
31/15-17 Lane St
Tel: 98964949
CALL TODAY FOR AN APPOINTMENT 1300 APEX DENTAL
www.apexdentalcentre.com.au



## బాలవాహిని



### 16. సరోజినీ నాయుడు



*ఆంధ్రావని కోడలా!*
*మన భారత కోకిలా!*
*మహిళా తొలి గవర్నర్!*
*స్వాతంత్ర్యపు రణ జీవనా!*
*సరోజినీ నాయుడా!*
*అభివందన చందనం!*

- ★ జననం :- 1879 ఫిబ్రవరి 13, హైదరాబాద్.
- ★ మత సామరస్య స్థాపనలో గొప్ప కృషి చేశారు.
- ★ 'హిందూ ముస్లిమ్ భాయి భాయి' నినాదంతో ఉపన్యాసాలిచ్చారు.
- ★ తండ్రి బెంగాలీ అయినా హైదరాబాద్‌లోనే ఉండేవారు. తల్లి విద్యావేత్త.
- ★ ఇద్దరూ విద్యావేత్తలు కావడంచేత ఆ రోజుల్లో ఈమెను బాగా చదివించారు.
- ★ విద్యావంశం కావడం వల్ల నిజాం నవాబుతో సాన్నిహిత్యం ఉండేది.
- ★ మంచి కవయిత్రి, గాయని కావడంచే పాటలు రాసి పాడేవారు.
- ★ 1898 వరకు అనేక దేశాలలో తిరిగి సంస్కృతి సంప్రదాయాలు మేధావుల వల్ల గ్రహించారు.
- ★ డా॥ గోవిందరాజులు నాయుడు గారిని ప్రేమించి పెళ్ళాడారు.
- ★ గోల్డెన్ త్రెషోల్డ్ (బంగారు వాకిలి) తన ఇంటి పేరు.
- ★ 1912 ముస్లిం లీగ్‌లో ఆంగ్లేయులను తరిమికొడదాం అని నినదించారు.
- ★ గోపాలకృష్ణ గోఖలే మెప్పు పొందారు.
- ★ గాంధీ అడుగుజాడల్లో నడుస్తూ స్వాతంత్ర్యం వచ్చే వరకూ అనేక కష్టాలు చూసి, జైలుకువెళ్ళి, కుటుంబానికి దూరమయ్యారు.
- ★ 'భారతీయ కోకిల' ఆమె బిరుదు.
- ★ నిర్యాణం :- 1949 మార్చి 2.

**సూక్తి :- మైత్రియే మిన్నయౌ గదా ధాత్రియెందు!**



❖❖❖❖❖


Swagath
Biryani House
(02) 8810 6690
http://www.swagath.com.au
46 Station Street
Wentworthville
NSW 2145

❖❖❖❖❖


Venkat Kantipudi, B.Com, MPA, FIPA, FTIA
HOME LOANS
INVESTMENT & SMSF LOANS
TAX RETURNS & ACCOUNTING
Mortagage Broker & Tax Agent
Suite 11/55 Phillip St, Parramatta, NSW
Phone: 02 9633 2536 Mob: 0421 374 365
Email: venkat@associatedaccounting.com.au

❖❖❖❖❖